ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	38.4	28.1
కావలి	36	28
ఆత్మకూరు	38	28
ఉదయగిరి	38	27
కందుకూరు	38	28



ఆపరేషన్ సిందూర్.. కమలనాథుల సంబరం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై బీజేపీ నాయకులు నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్‌లో జాతీయ జెండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ మహిళల నుదుట సిందూరాన్ని తుడిచి వేసిన ఉగ్రవాదులను మహిళా కమాండోల నాయకత్వంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశారన్నారు. ఉగ్రవాదాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్న పాకిస్థాన్‌కు ఈ సైనిక దాడి హెచ్చరిక లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, పద్మావతి, నాగలక్ష్మి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు. కోవూరులో రాజకీయ పార్టీల నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు.

● **నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) :** పాకిస్థాన్ మోస్ట్ వాంటెడ్ లష్కర్ ఇ తోయిబా ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు హాఫీజ్ సయ్యద్, మసుద్ అజర్‌లకు నగరంలోని పెన్నానది ఒడ్డున బీజేపీ నాయకులు కర్మఖండలు నిర్వహించారు.

● **నెల్లూరు (సాంస్కృతికం) :** పాక్‌లో ఉగ్రవాద స్థావరాలను నిర్వీర్యం చేసిన భారత సైన్యానికి అభినందనలు తెలుపుతూ కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని నర్తకి సెంటర్‌లో జాతీయ జెండాను ప్రదర్శించి, మిఠాయిలు పంచిపెట్టారు. కేతా సుబ్బారావు, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, షేక్ అబ్దుల్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు హెచ్చరించినప్పుడు కింద పడుకోవడం..

గాయపడిన వారిని తరలిస్తూ..

సన్నద్ధత సైరన్!

● **పోలీస్, అగ్నిమాపక దళం మాక్‌డ్రిల్**

దేశ సరిహద్దులో ఉద్రిక్తత నెలకొన్న వేళ ఎలాంటి పరిణామాలైనా ఎదుర్కొనేలా ప్రజలను సన్నద్ధం చేయడానికి పోలీసులు జిల్లావ్యాప్తంగా బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడి జరిగిన సమయంలో ఏవిధంగా బయట పడాలన్న విషయాలపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో నెల్లూరు ఆర్డీవో అనూష పర్యవేక్షణలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. దాడి జరుగుతున్న సమయంలో సైరన్ మోగినప్పుడు ప్రజలు కింద పడుకోవడం, దూరంగా పారిపోవడం, సెల్‌ఫోన్లు, లైట్లు ఆఫ్ చేయడం ఇలా అనేక జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ప్రజలను ఏవిధంగా కాపాడతారన్న అంశాలను మాక్‌డ్రిల్‌లో చూపించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర తాహసీల్దార్ షఫీ మాలిక్, ఆర్టీసీ ఆర్ఎం ముధుబాబు, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

\- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరులో జెండావందనం చేస్తున్న బీజేపీ నాయకులు



డ్రోన్ ద్వారా పరిశీలన

ఉగ్రవాదం అణచివేతలో ఏకం కావాలి

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం : ఉగ్రవాదం అణచివేతలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే నిర్ణయాలకు అందరం కట్టుబడి ఉండాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం సోమశిలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని దేశాలు బాగుండాలని భారత్ కోరుకుంటూ ఉంటే పాకిస్థాన్ మాత్రం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ ఉగ్రమూకలు చేసే ఆగడాలను పోత్సహించడం చూస్తున్నామని చెప్పారు. ఆ దేశానికి గుణపాఠం చెప్పే రోజు ఆసన్నమైందన్నారు. ఉగ్రవాద అణచివేతకు తీసుకొనే ప్రతి నిర్ణయానికి దేశంలోని 125 కోట్ల మంది ప్రజలు తమ మద్దతు తెలపాలని కోరారు.

● **మన సత్తా ఏంటో చూపించాం : ఎంపీ**

నెల్లూరు (హరనాథపురం) : భారత పరాక్రమాలకు ఆపరేషన్ సిందూర్ చర్య నిదర్శనమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత్ ఆర్మీపై ఆయన ప్రశంసలు కురిపించారు. భారత సైన్యం పరాక్రమాలు ఏంటో పాకిస్థాన్‌కు చూపించారని పేర్కొన్నారు. దేశ భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ శత్రువుకు భయంకర ప్రతిస్పందన ఇస్తున్న భారత సాయుధ దళాలకు ధన్యవాదాలు తెలిపారు.



ధ్వజారోహణ గావిస్తున్న ఆలయ అర్చక బృందం

వేదగిరీశుని ఉత్సవాలకు రారండి!

● శాస్త్రోక్తంగా ధ్వజారోహణ

● గరుడపటంతో దేవతలకు ఆహ్వానం

నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజపటం ఎగిరింది. ముందుగా అర్చక బృందం గరుడ పటానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆ తర్వాత ధ్వజస్తంభానికి అధిరోహింపజేశారు. అనంతరం లక్ష్మీ నృసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. తొలి వాహన సేవగా స్వామి వారు శేష వాహనంపై ఆలయ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో వేమూరి గోపి, ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు పర్యవేక్షించారు.



అవార్డు అందుకుంటున్న కో ఆర్డినేటర్ పద్మజ

గురుకుల ఉత్తమ కో ఆర్డినేటర్‌గా పద్మజ

● పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ నెల్లూరు జిల్లా కో ఆర్డినేటర్ టీ పద్మజకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ జిల్లా కో ఆర్డినేటర్ అవార్డు లభించింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించి జిల్లాను ఉత్తమ స్థానంలో నిలబెట్టినందుకు ఆమెకు ఈ అవార్డు దక్కింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నతాధికారులు పురస్కారంతోపాటు నగదు బహుమతిని అందజేశారు. జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా అవార్డులు లభించాయి. పెద్దపావని గురుకులంలో పదో తరగతి చదివిన ఎస్ కవిత(593 మార్కులు), ఇంటర్ చదివిన వీ ప్రవల్లిక (986), భావన (986)లకు అవార్డుతోపాటు నగదు బహుమతులు అందుకున్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించినందుకు అవార్డులు దక్కాయి.

నాన్‌డెల్టాకు నీటి విడుదల చరిత్రాత్మకం

● సమన్వయంతో ప్రాజెక్టుల్లో నీటి నిల్వకు శ్రీకారం

● ఉమ్మడి జిల్లాలో 4 లక్షల ఎకరాల్లో సాగు

● మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అనంతసాగరం మే (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయం నుంచి రెండవ పంట నాన్‌డెల్టాకు నీరు సరఫరా చేసి నూతన అధ్యయనానికి శ్రీకారం చుట్టడం చారిత్రాత్మకమని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రాజెక్టును సందర్శించి, పవర్ ప్లాంట్‌లో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి స్విచ్ ఆన్‌చేసి నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి ఆనం మాట్లాడుతూ సోమశిల, కండలేరు జలాశయాల్లో సమన్వయంతో నీటి నిల్వ చేసి ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 4 లక్షల ఎకరాలు డెల్టా, నాన్‌డెల్టాకు నీరు ఇస్తున్నట్లు తెలిపారు. జలాలను పొదుపుగా సద్వినియోగం చేసుకొని నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని రైతులను కోరారు. ఐఏబీ నిర్ణయం మేరకు ప్రతి కాలువకు నీరు ఇస్తామని చెప్పారు. గతంలో రెండవ పంట నాన్‌డెల్టాకు నీరు ఇచ్చేందుకు ప్రాంతాలు, నాయకులు, ప్రజాప్రతినిధుల మధ్య విభేదాలు వచ్చేవని, గత వైసీపీ హయాంలో ఒక్కసారి కూడా రెండవ పంటకు నీరు సరఫరా చేసి రైతులను ఆదుకొన్న దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రయోజనాలు గుర్తించి రాష్ట్రంలోని ప్రాజెక్టులకు పునరుజ్జీవం పోస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి, తాళ్లూరి గిరినాయుడు, ఉత్తర కాలువ చైర్మన్ మెట్టుకూరు కృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షురాలు సునీత, సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో పావని, తహసీల్దారు సుభాషిణి, సాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం

బియ్యం కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

● నెల రోజులపాటు ప్రక్రియ ● 12 నుంచి వాట్సప్ ద్వారా కూడా..

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డులు (బియ్యం), ఉన్న కార్డుల్లో మార్పు, చేర్పుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ కార్డులను జూన్‌లో ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఇక కొత్త కార్డుల కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ బుధవారం మొదలైంది. జిల్లాలో 6.37 లక్షల కుటుంబాలు ఉండగా, 24.69 లక్షల జనాభా ఉంది. ఇక 7.35 లక్షల బియ్యం కార్డులు ఉండగా, 1513 రేషన్‌డీలర్ల ద్వారా 13వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. కాగా, ఉన్న కార్డులలో 2.48 లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదని నిర్ధారించి దశలవారీగా వారికి అవకాశం కల్పించారు. 1.25 లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోలేదు. కొత్త బియ్యం కార్డుల కోసం అర్హులు మూడేళ్లుగా ఎదురుచూస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అవకాశం కల్పించింది. సచివాలయాల్లో బుధవారం నుంచి దరఖాస్తు స్వీకరణ ప్రారంభమవగా 12వ తేదీ నుంచి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు. నెలరోజులపాటు ఈ ప్రక్రియ ఉంటుంది. అనాథ ఆశ్రమాల్లో ఉండేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక జూన్‌లో జారీ చేసిన స్మార్ట్ కార్డుల ఆధారంగా దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. ఈకేవైసీ పూర్తయిన వాళ్లు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక జూన్‌లో స్మార్ట్ కార్డుల రూపంలో కొత్త కార్డులను కొరియర్ ద్వారా లబ్ధిదారుల చిరునామాకు పంపిస్తారు.

● రేషన్‌కార్డులో కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను కలుపుకోవచ్చు.

● ఒకవేళ కార్డు వద్దనుకున్నా దరఖాస్తు చేసుకోవచ్చు.

● కుటుంబ విభజనలో భాగంగా కొత్త కార్డు మంజూరు చేస్తారు.

● ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీల నుంచి కూడా దరఖాస్తు స్వీకరిస్తారు.

● చిరునామా మార్పు, తప్పులను సవరించుకోవచ్చు.

● రేషన్‌కార్డులో తప్పుగా ఉన్న ఆధార్ నెంబర్‌ను సరి చేసుకునే వెసులుబాటు ఉంటుంది.



ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాము. సచివాలయాల్లో దరఖాస్తు అందజేయవచ్చు. అదేవిధంగా కార్డుల విభజన, కొత్త సభ్యుల చేరిక, చిరునామాల మార్పు, మృతుల పేర్ల తొలగింపు, కార్డులు సరెండర్ తదితర రకాల సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలి.

\- ఎన్.విజయకుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజేశ్వరి

నెల్లూరు (వ్యవసాయం), మే 7 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జీ రాజేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడకు చెందిన రాజేశ్వరి రాజమండ్రి, గుంటూరు వైద్య కళాశాలల్లో పనిచేశారు. రాజమహేంద్రవరంలో బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ కళారాణి, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైద్య కళాశాల, ఆసుపత్రి అభివృద్ధికి, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజేశ్వరి తెలిపారు.



రాజేశ్వరి

జేసీకి నుడా వీసీ బాధ్యతలు

నెల్లూరు (జడ్పీ), మే 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) వైస్‌చైర్మన్ బాధ్యతలను జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు అప్పగిస్తూ మున్సిపల్ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొన్నటిదాకా నుడా వీసీ ఇన్‌చార్జి బాధ్యతలను కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ నిర్వహిస్తూ వస్తుండగా, గత నెల 16న ఆయన బదిలీ అయ్యారు. దీంతో అప్పటినుంచి వీసీగా ఎవరిని నియమిస్తారనే ఉత్కంఠ నెలకొంది. అయితే, అనూహ్యంగా జేసీ ఇన్‌చార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

ఉసురు తగిలింది..

శిక్ష పడింది!

● ఎందరో ప్రాణాలు బలిగొన్న 'గాలి' అత్యాశ

● 120 కి.మీ పొడవునా 'ఐరన్‌ఓర్' దారుణాలు

● జనార్ధన్‌రెడ్డికి శిక్షతో బాధిత కుటుంబాల్లో ఆనందం

నెల్లూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : అడవులను హరించి.. వందలాది కిలోమీటర్ల రహదారులు ధ్వంసం చేసి, వేలాది మంది ప్రజలను శ్వాసకోస వ్యాధులకు గురిచేసి, అడ్డూఅదుపు లేని వేగంతో అమాయకులను తొక్కించి, వారి సమాధుల మీద రూపాయలతో కోటలు కట్టుకున్న గాలి జనార్దన్‌రెడ్డికి ఎట్టకేలకు పీడిత ప్రజల ఉసురు తగిలింది. ఓబులాపురం నుంచి కృష్ణపట్నం నౌకాశ్రయం వరకు ఇనుప ఖనిజం కొల్లగొట్టడానికి జనావాసాల మీదుగా వేలాది లారీలు నడిపిన జనపీడితుడికి తగిన శిక్ష పడింది. వ్యాపారాలు చేయడం తప్పు కాదు. అందుకు రవాణా చేయడమూ తప్పు కాదు. కానీ ప్రజలకు ఇబ్బంది కలగకూడదు. 2004 నుంచి 2009 వరకు ఐదేళ్లపాటు సాగిన ఈ దుర్మార్గమైన రవాణా జిల్లాలో ఎంతో మంది ప్రాణాలను బలిగొంది. జిల్లా పరిధిలోని 120 కిలోమీటర్ల ప్రయాణంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు ఐరన్ ఓర్ లారీల కింద పడి ప్రాణాలు విడిచారు. ఇనుప ఖనిజం రవాణా మంచి లాభసాటిగా మారడంతో విపరీతంగా లారీలు, టిప్పర్లు ఇందుకు పోటీ పడ్డాయి. అధికారం, అర్థబలం రెండు పుష్కలంగా ఉన్న కారణంగా అధికారులు ఇనుప ఖనిజం రవాణా వాహనం ఫిట్‌నెస్ గురించి పట్టించుకోవడం మానేశారు. దారినపోయే లారీలను లెక్కించుకొని మామూళ్లు తీసుకోవడమే తమ ఉద్యోగ ధర్మంగా భావించారు. దీంతో కండీషన్ లేని వాహనాలు, శిక్షణ లేని డ్రైవర్లు రహదారులపై సామాన్య ప్రజల రక్తం చవిచూశారు. ఐదేళ్ల కాలంపాటు తిరిగిన లారీల వల్ల కలిగిన వాయు కాలుష్యంతో వేలాది మంది ప్రజలు ఊపిరితిత్తుల వ్యాధులకు గురయ్యారు. ప్రధానంగా మర్రి పాడు, సంగం, బుచ్చి, వెంకటాచలం, ముత్తుకూరు తదితర ప్రాంత ప్రజలు కాలుష్యానికి ఊళ్లు వదిలి వెళ్లిపోయే పరిస్థితి వచ్చింది. పై ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ లారీల కింద పడి పదుల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. మరోవైపు ఓవర్‌లోడ్ కారణంగా జిల్లాలోని 120 కి.మీ పరిధిలోని రహదారులు ధ్వంసం అయ్యాయి. మొత్తమ్మీద ఐరన్‌ఓర్ ట్రాన్స్‌పోర్టు ద్వారా కొందరతే లాభపడ్డారు కానీ అన్నెం, పున్నెం ఎరుగని సామాన్యులు మాత్రం నిత్య నరకం అనుభవించారు. ప్రజలను ఇంత క్షోభకు గురిచేసిన గాలి జనార్ధన్‌రెడ్డికి ఓబులాపురం మైనింగ్‌లో అక్రమాలకు పాల్పడినందుకు సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించడం పట్ల జిల్లాలోని బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఆనాటి భయంకర జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని చేసిన తప్పునకు సరైన శిక్ష పడిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఈయన పేరు కొల్లా మాల్యాద్రి. సంగం వాసి. 9-10-2010 తేదీన సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సంగం బస్టాండు వద్ద ఐరన్ ఓర్ లారీ ఢీకొంది. దీంతో లారీ చక్రాల కింద నలిగి మాల్యాద్రి మృతి చెందాడు. ఇంటి యజమాని మృతి చెందడంతో భార్య సుబ్బమ్మ, ఇద్దరు కుమార్తెలు దిక్కులేని వారయ్యారు. నాడు ఇద్దరు కుమార్తెలు మైనర్‌లు కావడంతో మేజర్ అయిన తరువాత నగదు కోర్టులో నగదు ఇస్తామన్నారు. వారు మేజర్ అయి.. పెళ్లిళ్లు కూడా జరిగాయి. ఇంతవరకు పరిహారం మాత్రం అందజేలదు. ఈ పరిస్థితి మాల్యాద్రి ఒక్కరిదే కాదు. నాడు ఐరన్ ఓర్ లారీల చక్రాల కింద నలిగిన ఎంతోమంది కుటుంబాల దీనగాథ ఇది.



కొల్లా మాల్యాద్రి (ఫైల్)

● సంగం మండలం పల్లిపాళెంకు చెందిన అత్తిపాటి వెంకటరత్నందీ పేద కుటుంబం. ఒకరోజు ఇదేవిధంగా తెల్లవారుజామున సైకిల్‌పై కూరగాయలు తీసుకుని సంగం దాటి పెరమనకు వెళ్తున్నాడు. మార్గమధ్యంలో కొండ మలుపులో వెనుక నుంచి ఐరన్ ఓర్ లారీ తొక్కించి వెళ్లిపోయింది. మృతుడికి భార్య పద్మమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటిపెద్ద మృతితో ఆ కుటుంబం నానా కష్టాలు పడుతోంది.

● సంగం మండలం పెరమనకు చెందిన కొంజేటి అంకమ్మ, రమణయ్య ఇతర కూలీలతో కలిసి రోడ్డు పక్కన ఉపాధి పనులు చేస్తుండగా ఐరన్ ఓర్ లారీ అదుపు తప్పి కూలీల మీదకు దూసుకు వచ్చింది. ఆ ప్రమాదంలో అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మండలంలో ఇలాంటి సంఘటనలు ఒకటి కాదు... రెండు కాదు. ఐదేళ్లలో 25 మందికి పైగా ఐరన్ ఓర్ లారీల కారణంగా మత్యువాత పడ్డారు.



సంగంలో మాల్యాద్రిని పొట్టనపెట్టుకున్న ఐరన్ ఓర్ లారీ (ఫైల్)



గాలి జనార్ధన్‌రెడ్డి

రోడ్డుపైకి రావాలంటేనే భయపడేవాళ్లం

మైనింగ్ లారీలు తిరుగుతున్న ఏ సమయంలో ఏం జరుగుతుందోననే భయంతో ఉండేవాళ్లం. బైక్‌పై ఆత్మకూరు వెళ్లి తిరిగి ఇంటికి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని తిరిగేవాళ్లం. కృష్ణపట్నం పోర్టులో ఐరన్‌ఓర్‌ను అన్‌లోడ్ చేసి, తిరిగి సీరియల్ కోసం లారీలను డ్రైవర్లు పోటీపడి నడిపేవాళ్లు. ఒకరోజు నేను మర్రిపాడు బస్టాండ్‌లో ఉండగా, బద్వేల్ వైపు 2 కి.మీ దూరంలో మైనింగ్ లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వచ్చిన ఓ కారు ఢీ కొంది. ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. ఇప్పటికీ ఈ ఘటన నాకు గుర్తుంది.

\- కె. వెంకటేశ్వర్లు, మర్రిపాడు



జనరల్ నోటీసు

నా క్లయింట్ అయిన **షేక్ సర్దార్ తండ్రి కాలేషా**, బుచ్చిరెడ్డిపాళెం గ్రామం & మండలం, SPSR నెల్లూరుజిల్లా అనువారు ఇచ్చిన వివరముల మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- దిగువ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని **సయ్యద్ గౌస్ బీబీ సాహెబా గారి తల్లి గారైన సకినా బీబీ** గారు **రిజిష్టర్డు సెటిల్‌మెంట్ పత్రం నెం.2126/1952** ద్వారా **సయ్యద్ గౌస్ బీబీ సాహెబా** గారికి వ్రాయించి ఇచ్చినారు. తదుపరి **సయ్యద్ గౌస్ బీబీ సాహెబా** గారు ఆమె తల్లి ద్వారా సంక్రమించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని ఆమె కుమారులు మరియు కుమార్తె అయిన **1. సయ్యద్ రియాజ్ అహమ్మద్ (డా.నెం.1200/1992 ద్వారా 5 అంకణములు) 2. సయ్యద్ కరిముల్లా (డా.నెం. 1199/1992 ద్వారా 8 అంకణములు) 3. సయ్యద్ సర్తాజ్ బేగం (డా.నెం. 3328/1990, 3329/1990 ద్వారా 12 అంకణములు)**లకు సెటిల్‌మెంటు పత్రములు వ్రాసి ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై వారలకు చెందజేసియున్నారు. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై ముగ్గురి వద్ద నుండి నా క్లయింట్ అయిన **షేక్ సర్దార్** కొనుగోలు చేసి అగ్రిమెంటు వ్రాయించుకోవడమైనది. కావున యావన్మందికి తెలియజేయడమేమనగా క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఆక్షేపణలు/ అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రస్సుకు లిఖితపూర్వకముగా సరియగు ఆధారములతో తెలుపుకోవలసినది. తదుపరి వచ్చు ఆక్షేపణలు నా క్లయింట్‌ను బద్ధగించవు.

ఆస్తి షెడ్యూలు

నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు యిలాకా నెల్లూరు సబ్ రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు టవున్ నారాయణరావుపేటలో చేరిన అగ్నిపేటలోని కంసాలివీధి, సంతపేట, మునిసిపల్ వార్డు నెం.14 రు, డోరు నెం.763రు గల పూరి యిల్లు ఖాళీ స్థలమునకు **హద్దులు: తూర్పు:** సయ్యద్ ఖాదరు యింటి గోడ కొంతవరకు ప్రహరి గోడ కొంతవరకు, **దక్షిణం:** కందకము కాల్వ, **పడమర:** అబ్దుల్ రహిమాన్ సాహెబు గారి ప్రహరిగోడ, **ఉత్తరం:** రాజవీధి. యీ హద్దులలోని పూరి యిల్లు షుమారు రెండు అంకణములు చేరి 6 అంకణములున్నూ యిందుకు సంబంధించిన తలుపులు, ద్వారబంధనములు అడుగు స్థలము పై కప్పు సామానులున్నూ ఖాళీ స్థలము షుమారు 19 అంకణములున్నూ కుల్లు 25 అంకణములు. యిందుకు సంబంధించిన యావత్తు యాక్‌మెంటు హక్కులతోటి.

షేక్ అన్వర్‌బాషా, B.Com., LLB., అడ్వకేట్, యాసిన్‌స్ట్రీట్, SBI ఎదురుగా, ఆచారివీధి, నెల్లూరు-1. సెల్: 9441960661

అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం

సీతారామపురం, మే 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని రైతుసేవా కేంద్రాలలో అర్హులైన రైతులను గుర్తించు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ వెబ్‌సైట్‌లో మండలంలో 6003 మంది రైతుల వివరాలు పొందుపరచడం జరిగిందన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు అర్హత గల రైతుల జాబితాను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9371
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ.101.80

శ్మశాన వాటికల్లో కనీస వసతుల కరువు

● అంత్యక్రియలు, కర్మకాండలకు అవస్థలు


ముళ్లచెట్లతో నిండిన హిందూ శ్మశాన వాటిక దారి


అసంపూర్తి నిర్మాణంతో ముస్లిం శ్మశానవాటిక భవనం

ఉదయగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో హిందూ, ముస్లిం శ్మశాన వాటికల్లో కనీస వసతులు లేక మృతుల అంత్యక్రియలు, కర్మకాండల నిర్వహణకు వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్మశాన వాటికల అభివృద్ధి అటకెక్కింది. టీడీపీ హయాంలో 2014-19 మధ్య కాలంలో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధు లు కేటాయించినా అరకొర పనులతో సరిపెట్టారు. నిర్మా ణాలు పూర్తిచేసుకున్న శ్మశాన వాటికల్లో ప్రస్తుతం కంప చెట్లు ఏపుగా పెరిగి అడుగుపెట్టలేని దుస్థితి నెలకొంది. దీంతో అంత్యక్రియలు, కర్మకాండలకు అవస్థలు తప్పడంలేదు.

ముళ్లచెట్లతో మూసుకుపోయిన శ్మశాన దారులు

ఉదయగిరి పట్టణంలో గల హిందూ, ముస్లిం శ్మశాన వాటికల్లో అంత్యక్రియలు, కర్మకాండల నిర్వహణకు ప్రత్యేక గదులు, నీటి వసతి లేదు. వర్షాకాలంలో దహన సంస్కారాలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీనికితోడు ఆయా శ్మశాన వాటిల్లో ముళ్లచెట్లు ఏపుగా పెరిగిపోవడం, దారులు మూసుకుపోవడంతో అంత్యక్రియల నిర్వహణ కష్టతరంగా మారింది. కొందరు సొంత నిధులు వెచ్చించి శ్మశాన వాటికల్లో ముళ్లచెట్లను తొలగించడంతోపాటు రహదారులను ఏర్పాటుచేసుకున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం లేకుండాపోతోంది. ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేసినా అసంపూర్తి గది, ప్రహరీ నిర్మాణంతో సరిపెట్టుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి పంచాయతీకి ఒకటి చొప్పున శ్మశానాల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని విస్మరించింది. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసినా శ్మశాన వాటికలు ముళ్లచెట్లు, వ్యర్థాలతో నిండి ఉండడంతో దహన సంస్కారాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు చేపట్టి వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

వన్యప్రాణుల కోసం నీటికుంటల నిర్మాణం

బీఎస్ కుమారరాజా, అటవీ శాఖాధికారి



ఉదయగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా వన్యప్రాణులు గ్రామాల్లో రాకుండా అటవీ ప్రాంతాల్లో నీటి కుంటలు నిర్మిస్తున్నట్లు ఉదయగిరి అటవీ శాఖాధికారి బీఎస్ కుమారరాజా తెలిపారు. ఇప్పటికే రేంజ్ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో నీటికుంటల నిర్మాణాలు చేపట్టామని, అవసరమైన చోట మరికొన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

? ఏఏ రకాల వన్య ప్రాణులు ఉన్నాయి.

! ఉదయగిరి అటవీ శాఖ పరిధిలోని వెలుగొండ అడవుల్లో చిరుత, దుప్పులు, జింకలు, ఎలుగుబంట్లు, నెమళ్లు, తోడేళ్ల తదితర వన్యప్రాణులున్నాయి.

? ఉదయగిరి రేంజ్ పరిధిలో అటవీ విస్తీర్ణం ఎంత.

! 55,218 హెక్టార్లు ఉంది.

? అడవులు అగ్నికి ఆహుతి కాకుండా చర్యలు చేపడుతున్నారా.

! వేసవిలో అడవులు అగ్నికి అహుతి కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. సిబ్బందితో అటవీ అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాల్లో కళాజాత బృందం చే అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు


ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

ఆత్మకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. కుంకుమార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మ వారిని పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత అలఘునాధస్వామి ఆలయంలో స్వామి వారికి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో తల్లిదండ్రులు మరణించి అనాధగా మిగిలిన చిన్నారి నాగజ్యోతికి నిత్యాన్నదాత, సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి బుధవారం రూ.12వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లో నాగజ్యోతికి తమ ట్రస్టు అండగా ఉంటుందని అన్నారు.

చదరంగంలో విద్యార్థులు రాణించాలి


చదరంగం ఆడుతున్న విద్యార్థులు

వింజమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): చదరంగంలో విద్యార్థులు రాణించాలని గ్రంథాలయాధికారి జ్యోతికొండయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం వెంకటేశ్వర్లు సూచించారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం చదరంగంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

పాస్ పోర్ట్ మిస్సింగ్

పాస్ పోర్ట్ మిస్సింగ్... ఇండ్ల అంజయ్య S/o ఇండ్ల ఆదయ్య, 20-94, స్టేట్ పేట, ST కాలనీ, ఉదయగిరి గ్రామం, ఉదయగిరి(మం), SPSR నెల్లూరు జిల్లా కు చెందిన నేను నాకు సంబందించిన నెం.N9955427 గల నా ఒరిజినల్ పాస్ పోర్ట్ ను తేది 02-05-2025 న ఉదయగిరి పాత బస్టాండ్ సెంటర్ నందు జెరాక్స్ తీసుకొని వెళుతుండగా దారిలో పోగొట్టుకున్నాను కావున ఎవరికైనను దొరికిన యెడల తెలియచేయగలరు.

ఇట్లు: ఇండ్ల అంజయ్య
cell :93989 17420

అల్లూరికి ఘన నివాళి


వరికుంటపాడు: అల్లూరికి నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు: విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె శ్రీనివాసరెడ్డి సిబ్బందితో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కృష్ణారావు, వీపీ సుబ్బారెడ్డి, వెలుగు సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది, పాల్గొన్నారు.

పక్కాగృహాలు మంజూరు చేయాలి

● మంత్రి ఆనంకు ఎస్సీకాలనీ వాసుల వినతి


సమస్యలు చెబుతున్న కాలనీ వాసులు

అనంతసాగరం మే 7 (ఆంధ్రజ్యోతి): పక్కాగృహాలు మంజూరుచేయాలని మండలంలోని పడమటికంబపాడు గ్రామం ఎస్సీకాలనీ వాసులు బుధవారం సోమశిలలో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. పక్కాగృహాలు లేక గుడిసెల్లో జీవనం సాగిస్తున్నామని, ఇళ్లు మంజూరుచేసి కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. దీంతో ఆయన స్పందించి పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో పావనిని ఆదేశించారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి


చిన్నారులకు ఆధార్ నమోదుచేస్తున్న సిబ్బంది

వింజమూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 0నుంచి 6 సంవత్సరాల వయసు కలిగిన చిన్నారులకు ఆధార్ నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో కె శ్రీనివాసరెడ్డి బుధవారం తెలిపారు. ప్రస్తుతం గుండెమడకల సచివాలయం, వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆధార్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, వాటి ద్వారా పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీ సునీల్, అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

● నేలకొరిగిన విద్యుత్ స్తంభం


తోటలచెరువుపల్లిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఉదయగిరి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొనడంతో పాటు తాగునీటి పథకాలు నిలిచిపోయాయి. వీటికితోడు సాగులో ఉన్న ఉద్యాన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. అలాగే గండిపాళెంలో పండ్ల చెట్లు విరిగిపోగా, వరికుంటపాడు మండలం తోటలచెరువుపల్లి బీసీ కాలనీలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో ప్రజలు నివాసాలకే పరిమితం కావడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ నాన్‌వాయిస్ కోర్సులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తారని, ఆసక్తి కలిగిన అభ్యర్థులు పాలిటెక్నికల్ కళాశాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9182799405 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

వైభవంగా వీరబ్రహేంద్రస్వామి ఆరాధనోత్సవం


వింజమూరు: వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

ఆత్మకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని బైపాస్ రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి, ఆలయంలో బుధవారం గోవిందమాంబ సమేత స్వామి వారి ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం వెంకట్రావుపల్లి, ఆత్మకూరు పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.

●వింజమూరు: పట్టణంలో విరాట్‌నగర్‌లో ఉన్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో స్వామివారి పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

ఉదయగిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గంగమ్మతల్లి ఆలయ సమీపంలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఇంజనీరింగ్ అధికారులు ప్రారంభించారు. అలాగే గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి మరో రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజులు మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ సహాయకులు రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు రాజా, గోపి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీవో కార్యాలయ భవనానికి మరమ్మతులు

స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం మరమ్మతు పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్, ఏఈ శ్రీనివాసరాజులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులు రూ. 27 లక్షలతో శిథిలావస్థకు చేరిన భవనంపై స్లాబు తొలగించి నూతనంగా పిల్లర్లను ఏర్పాటుచేసి స్లాబ్ వేయనున్నట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో పల్లెలు కళకళ

● ప్రజల్లో ఆనందం


సిమెంటు రోడ్డు వేస్తున్న కూలీలు

అనంతసాగరం, మే 7 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గుంతలతో రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులు నేడు సీసీ రోడ్ల నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనంతసాగరం మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 38 సీసీ రోడ్లకు ప్రతిపాదలు చేసి రూ. 233.80 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఇప్పటికి 35 రహదారులను పూర్తిచేశారు. రానున్న రోజుల్లో మిగిలిన రోడ్లను కూడా సిమెంటు రోడ్లుగా మార్చేలా యంత్రాంగం ప్రణాళికలు చేసింది. గ్రామీణ ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మండుతున్న కూల్‌డ్రింక్స్ ధరలు

● బెంబేలెత్తుతున్న ప్రజలు

ఉదయగిరి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): మండుతున్న ఎండలను తట్టుకోలేక కాసింత ఉపశమనం పొందేందుకు కూల్‌డ్రింక్స్ దుకాణాల వద్దకు పరుగులు తీసిన ప్రజలు అక్కడి ధరలు చూసి బెంబేలెత్తుతున్నారు. పనులపై ప్రయాణాలు సాగించే ప్రజలతో పాటు స్థానికులు సైతం ఎండ వేడిమిని తట్టుకోలేక చల్లని కూల్‌డ్రింక్‌తో దాహం తీర్చుకునేందుకు ఆశతో కొనుగోలు చేసేందుకు వెళ్లినప్పటికీ అక్కడి ధరలను చూసి నిరాశతో వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయగిరి, వరికుంటపాడు మండల కేంద్రాలతో సహా గండిపాళెం, వెంగళరావునగర్, తిమ్మారెడ్డిపల్లి, జడదేవి, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఒక్కో కూల్‌డ్రింక్ సీసాపై అదనంగా రూ. 5నుంచి రూ. 10 వరకు వసూలు చేస్తున్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని దుకాణదారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ ధరల కంటే అదనంగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పదిమంది స్నేహితులు కలిసినా, ఇంటికి బంధువులు వచ్చిన సమయంలో చేసేదేమిలేక అదనపు నగదు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం మంచి నీటితో గొంతు తడుపుకునే పరిస్థితులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రూపాయి ఉన్న వాటర్ ప్యాకెట్‌ను సైతం ప్రస్తుతం రూ. 2 చొప్పున విక్రయిస్తున్నారు. రద్దీ ప్రదేశాలు, దాబాలు, మద్యం దుకాణాలు, బస్ స్టేషన్లు, హోటళ్ల సమీపంలో వీటి ధరలు మరింత రెట్టింపు చేసి అమ్మకాలు సాగిస్తుండడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అధిక నగదు వసూలు చేస్తున్న దుకాణదారులపై చర్యలు చేపట్టి నిబంధనల మేరకు అమ్మకాలు సాగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

రియల్టర్ హత్య కేసు ముమ్మర దర్యాప్తు

● ప్రత్యేక బృందాలతో విచారణ


హత్య జరిగిన ఇంటిలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేదాయపాళెం వెంకటరెడ్డి నగర్‌లో మంగళవారం జరిగిన రియల్టర్ చిన్నయ్య హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డాగ్‌స్క్వాడ్, ఫీన్స్ బృందం ఘటన స్థలంలో ఆధారాలను సేకరించాయి. చుట్టుపక్కల సీసీ కెమెరాల పుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. మంగళవారం రాత్రి ఏఎస్పీ సీహెచ్ సౌజన్య వేదాయపాళెం స్టేషన్‌కు చేరుకొని హత్య జరిగిన తీరు, సేకరించిన సాక్ష్యాలు, ఇతర అంశాలపై నగర డీఎస్పీ సింధుప్రియ, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రోశయ్య, అధికారులతో చర్చించారు. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. బుధవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డాగ్‌స్క్వాడ్ సైతం మరోమారు ఘటన స్థలంలో ఆధారాల కోసం ప్రయత్నించింది. కాగా, ఈ కేసును పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన సమయంలో ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును పోలీసులు విచారి స్తున్నారు. అతను చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నట్లు సమాచారం.

ఉదయగిరిలో విచారణ

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య నెల్లూరులో దారుణహత్యకు గురికావడంతో బుధవారం నెల్లూరు నుంచి వచ్చిన సీఐ సుబ్బారావు, ఎస్ఐ ముత్యాలరావు ఉదయగిరిలో విచారణ చేపట్టారు. హత్యకు గురైన చిన్నయ్య సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా సీతారామపురం మండలానికి చెందిన ఓ మహిళతో అత్యధిక సార్లు మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆమెను విచారించి వివరాలు సేకరించినట్లు తెలిసింది. అలాగే ఉదయగిరి పట్టణానికి చెందిన మరో మహిళ చిన్నయ్య వద్ద నెల్లూరులో ప్లాట్‌ను కొనుగోలు చేయడం, దానికి సంబంధించి రిజిస్ట్రేషన్ విషయంపై చిన్నయ్యను హత్యకు ముందురోజు కలవడంతో పోలీసులు ఆమెను సైతం ఫోన్‌లో విచారించినట్లు సమాచారం.

కక్ష సాధింపుతోనే రఫీ హత్య

● 8మంది నిందితుల అరెస్టు

● మారణాయుధాల స్వాధీనం : సీఐ


అరెస్టు చేసిన నిందితులతో కలసి కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 7 (ఆంధ్రజ్యోతి): కక్షసాధింపు, ఆధిపత్యపోరుతోనే మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామానికి చెందిన ఎస్‌కే.పెద్ద రఫీని నిందితులు హత్య చేసినట్టు తమ విచారణలో తేలిందని సీఐ శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈ కేసులో 8మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు హాజరు పరచగా, రిమాండుకు తరలించినట్లు ఆయన వెల్లడించారు.నిందితులు హత్యకు వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం బుచ్చి స్టేషన్‌లో ఆయన విలేకరులకు కేసు వివరాలు తెలియజేశారు. పోలినాయుడుచెరువు గ్రామంలో రెండు వర్గాల మధ్య పదేళ్లుగా ఘర్షణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి దాదాసాహెబ్, మరో వర్గానికి పెద్దరఫీ లీడర్లుగా ఉన్నారు. జనవరిలో జరిగిన గంధమహోత్సవంలో వీరి మధ్య వివాదాలు తలెత్తి గొడవ పడ్డారు. అంతేకాక పొలం విషయమై కూడా వివాదం ఉంది. వీటన్నింటికీ రఫీనే ప్రధాన కారణంగా భావించి, అతన్ని చంపేస్తే తమ ఆధిపత్యానికి అడ్డొచ్చేవారుండరనే ఉద్దేశంతో ప్రత్యర్థులు రఫీని హత్య చేసినట్టు సీఐ వెల్లడించారు. దాదాసాహెబ్ హత్యకు ప్రోత్సహించగా అతన్ని, నిందితులకు నెల్లూరులోని రంగనాయకుల పేటలో షెల్టర్ ఇచ్చిన షఫీ అలియాస్ షోరాను అరెస్టుచేసినట్టు ఆయన తెలిపారు. వీరితోపాటు మరో ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : వివాహం జరిగి సంవత్సరాలు గడుస్తున్నా పిల్లలు పుట్టలేదన్న బాధ, బ్యాంకులో పని ఒత్తిడితో బ్యాంకు ఉద్యోగి మంగళవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బత్తుల వీరేంద్ర(29)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఓ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వివాహం జరిగి రెండేళ్లయినా పిల్లలు పుట్టలేదని, బ్యాంకులో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని పదేపదే కుటుంబ సభ్యులకు చెప్పుకొని బాధపడేవాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో జాతీయ రహదారి వంతెన వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితంలేని వృద్ధుడి మృతి

దుత్తలూరు (ఉదయగిరి), మే 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలోని 565 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన జంపు వెంగయ్య (60) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ జాతీయ రహదారికి సమీపంలో ఉండే సత్రంలో ఉండేవాడని, తెల్లవారుజామున రోడ్డుపై వెళ తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 500

గోకులం షెడ్లకు ప్రతిపాదనలు పంపండి

లింగసముద్రం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ తీర్మానాలు లేక మూడు నెలలుగా ఆగిన 27 గోకులం షెడ్లు, ఇతర నిర్మాణ పనులకు తీర్మానాలు ఇచ్చినందున ఉపాధిహామీ సిబ్బంది వెంటనే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని ఉపాధిహామీ పథకం ఏపీవో దయాసాగర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 పశువుల నీటి తొట్ల నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. గోకులం షెడ్లు ఒక్కోటి రూ.2.30 లక్షలు, పశువుల నీటి తొట్లకు ఒక్కోదానికి రూ.33 వేలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈనెల 30 లోపు గ్రామానికి నాలుగు చొప్పున నీటితొట్లు నిర్మించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఉద్యానవన తోటల పెంపకంపై అవగాహన కల్పించి, రైతుల వివరాలు సేకరించి అంచనాలు తయారు చేయాలన్నారు. కూలీలు కొలతల ప్రకారం 4 గంటలు పనిచేస్తే రూ.290 కూలీ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ విజయకుమార్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మండల సమావేశానికి అధికారుల డుమ్మా



సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ మస్తానమ్మ, ఎంపీడీవో విజయ

ఉలవపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సమావేశానికి రెవెన్యూ, విద్యుత్, అటవీ శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. దీంతో తమ సమస్యలకు సమాధానం చెప్పేవారు లేనప్పుడు సమావేశాలు ఎందుకని ఎంపీటీసీలు, సర్పంచులు అసంతృప్తి వ్యక్తం చేశారు. భీమవరం పాఠశాల భవనం నిర్మాణ పనులు మొదలు పెట్టి పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేసేలా చూడాలని వైఎస్ ఎంపీపీ రమణయ్య కోరారు. ఆర్టీసీ బస్సులు సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా కోరారు. ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో ఎన్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కలిగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారికి ఆధార్‌కార్డు ఇవ్వడానికి కలిగిరి, సిద్ధనకొండూరు, చినఅన్నలూరు గ్రామాల్లో గురువారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ నమోదుకు పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రము తప్పనిసరని, లేనివారికి తహసీల్దారు మంజూరు చేసిన డొమైసిల్ సర్టిఫికెట్(అడ్రస్ ప్రూఫ్) ద్వారా ఆధార్ నమోదు చేస్తారని పేర్కొన్నారు. మండలంలోని ఆయా ప్రాంతాల పరిధిలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగేటట్లు చూడాలని పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

లింగసముద్రం, మే 7(ఆంధ్రజ్యోతి) : వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీ.రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా, రోజుకు 15 గ్లాసులు నీరు తాగాలని పేర్కొన్నారు. మధ్యాహ్న సమయంలో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

గుడ్లూరు, మే 7(అంధ్రజ్యోతి): గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్రయాణికులకు బుధవారం దాతలు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ ప్రదేశంలో ప్రతిరోజు మంచినీరు అందిస్తామని, వారంలో 3, 4 రోజులు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. నేత్రపురి శ్రీరామ్ సేవక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్నమూరి గరటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఉలవపాడు, మే 7(ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ అసోసియేషన్, సరయూస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉలవపాడులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం డాక్టర్ రాజేష్ ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగ ప్యాకెట్లు అందచేశారు. పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రత్నకుమార్, పాస్టర్ కమలాకర్, మోసేస్, సరయూస్ వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ము లేస్తోంది!



కావలి రూరల్, మే 7(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వైకుంఠపురంలో అన్నపగుంట పూడికతీత పనుల్లో భాగంగా అక్కడ తీసిన మురుగును ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ల వేగానికి ఆ ప్రాంతంలోని గ్రావెల్ రోడ్డులో దుమ్ము లేసి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నీరు చల్లకపోవడం, పగటి పూట మురుగు తరలిస్తుండడంతో అక్కడ రేగిన దుమ్ము రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లను చుట్టేస్తోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ట్రాక్టర్లలో తరలిస్తున్న మురుగు రోడ్డుపై పడుతుండడంతో ఆ బురదలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడి గాయపడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముస్తాబవుతున్న పార్కు!



ముస్తాబైన లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ నడిబొడ్డున ఉన్న దివి లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు నూతన హంగులతో ముస్తాబుతోంది. కందుకూరు గ్రామపంచాయతీగా ఉన్నకాలంలో ఏర్పాటైన ఈ పార్కు ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు సేద తీరేందుకు దోహదపడగా గత వైసీపీ ప్రభుత్వంలో పార్కు సుందరీకరణ కోసం సుమారు రూ.50 లక్షల నిధులు కేటాయించి పాత నిర్మాణాలు, చెట్లను పూర్తిగా తొలగించివేసి ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. అయితే అప్పట్లో పనులు నత్తనడకన సాగాయి. ఆ తరువాత సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గత ఏడాదిన్నర కాలంగా ఈపార్కు ప్రజలకు ఉపయోగపడకుండా పోయింది. ఇటీవలికాలంలో తిరిగి పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయడంతో పార్కు ముస్తాబై ప్రారంభానికి సిద్ధమవుతోంది. పార్కులో నూతనంగా షటిల్ కోర్టు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు ఓపెన్ జిమ్, చిన్నపిల్లలు ఆడుకునేందుకు అవసరమైన వివిధ రకాల పరికరాలు ఏర్పాటు చేశారు. వాటర్‌ఫౌంటైన్, వివిధరకాల పూలమొక్కలతో సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ప్రజలు సేదతీరేందుకు వీలుగా అక్కడక్కడ బల్లలు ఏర్పాటు చేసే పనులను రెండు మూడురోజుల్లో పూర్తి చేసి త్వరలోనే ప్రారంభించపజేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కాంట్రాక్టర్ పొడపాటి నాగేశ్వరరావు వివరించారు. అయితే పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ పార్కు గ్రామీణ ప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలు మధ్యాహ్నం వేళల్లో సేదతీరేందుకు ఎంతో అనుకూలంగా ఉండేదని, గత రెండేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ప్రస్తుతం కూడా కేవలం పూలమొక్కలే కాకుండా నీడనిచ్చే బాదం, పనస, మామిడి లాంటి చెట్లు కూడా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడు బల్లలు



పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్



జరుగుతున్న వాటర్ ఫౌంటైన్, వాకింగ్ ట్రాక్ పనులు

పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

● ఎంఈవో గోవిందయ్య



కావలిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దారిద్రరేఖకు దిగువనున్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య అందించేందుకు నిర్ణయించింది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకుని వారి పిల్లలను చేర్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో గోవిందయ్య తెలిపారు.

? ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు. ఎవరు అర్హులు.

! ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించి ఉచిత విద్య అందిస్తారు. దీనికి దారిద్రరేఖకు దిగువనున్న కుటుంబాలకు చెందిన పిల్లలు అర్హులు.

ఈ ఇంటర్వ్యూ

? అన్ని తరగతులకు అవకాశం ఉందా. కావలిలో ఎన్ని పాఠశాలలు అందుబాటులో ఉన్నాయి.

! కేవలం 1వ తరగతిలో ప్రవేశానికి మాత్రమే అవకాశం కల్పించారు. కావలి పట్టణంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు 35 ఉన్నాయి.

? ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఏఏ పత్రాలు సమర్పించాలి. చివరి తేదీ ఎప్పుడు.

! ఈనెల 15 తేదీ లోపల మీసేవలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో దరఖాస్తుతో పాటు జత చేయాలి.

పైలాన్‌ను కూలుస్తామని చెప్పలేదా?

● కోనేరులో మునిగి ప్రమాణం చేస్తావా ● మాజీ ఎమ్మెల్యేని ప్రశ్నించిన టీడీపీ నేతలు

కావలి, మే 7(ఆంధ్రజ్యోతి): కావలిలో అమృత పథకం పైలాన్‌ను కూలుస్తామని చెప్పి మరీ కూల్చింది మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి కాదా అని టీడీపీ నేతలు ప్రశ్నించారు. కావలి టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, తిరువీధి ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు, జనసేన నాయకుడు సిద్ధూ మాట్లాడుతూ 2019లో కావలి ప్రజల దాహార్తిని తీర్చటానికి అప్పటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడి సహకారంతో అమృతపథకం మంజూరు కాగా దాని కోసం ఏర్పాటు చేసిన పైలాన్‌ను రాష్ట్రమంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారన్నారు. ఆ పైలాన్‌ను 2020లో రాత్రికి రాత్రి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నేతలు, కొందరు విలేకరులు ధ్వంసం చేశారన్నారు. వారిపై కేసులు ఉండవా అని ప్రశ్నించారు. అది వైసీపీ ప్రభుత్వంలో మీ ప్రమేయంతో జరుగటంతో కేసును దర్యాప్తు చేయనీయకుండా ఫైలును మూసివేసింది వాస్తవం కాదాన్నారు. రౌడీయిజం గురించి ప్రతాప్‌రెడ్డి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. పైలాన్ ధ్వంసంతో మాజీ ఎమ్మెల్యేకు సంబంధం లేకపోతే శివాలయం కోనేరులో మునిగి దేవుడి ముందు ప్రమాణం చేయాలని, లేకపోతే పోలీసులకు సరెండరై వాస్తవాలు ఒప్పుకోవాలని సూచించారు.

జలదంకి బస్టాండులో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీలను తొలగిస్తున్న ఆర్టీసీ హమాలీలు

జలదంకి, మే7(ఆంధ్రజ్యోతి): జలదంకి బస్టాండులో ఇటీవల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎట్టకేలకు బుధవారం తొలగించారు. ఈ నెల 1న వింజమూరులో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌యాదవ్, నెల్లూరు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి వచ్చారు. వారు కావలి నుంచి వింజమూరు వెళుతుండగా మార్గమధ్యంలో జలదంకి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో బీజేపీ నాయకులు ఆపి మంత్రికి స్వాగతం పలికి సన్మానించారు. ఆ సమయంలో సురేష్‌రెడ్డికి బస్టాండు దుస్థితిపై బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఆర్టీసీ అధికారులను బస్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో కావలి ఆర్టీసీ డిఎం శ్రీనివాసులు మంగళవారం బస్టాండును పరిశీలించి బుధవారం కావలి ఆర్టీసీలో పనిచేస్తున్న హమాలీలను వెంటబెట్టుకుని వచ్చి ముందుగా బస్టాండు ఆవరణలో ఉన్న ఫ్లెక్సీలను మొత్తం తొలగించారు. బస్టాండు ప్రాంగణంలో ఫ్లెక్సీలు కట్టకుండా ఉండేలా తరుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫ్లెక్సీలు తొలగించే సమయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి, నాయకులు చల్లా హనుమారెడ్డి, వంటేరు రాకేష్‌రెడ్డిలు అక్కడే ఉండి పర్యవేక్షించారు. బీజేపీ నాయకుల చొరవతో బస్టాండు ప్రాంగణం ప్రయాణికులకు అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయంతో సాగునీరు వాడుకోండి

● సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్



లబ్ధిదారుడికి కల్టివేటర్ అందిస్తున్న బీద గిరిధర్, ఏడీఏ నాగరాజు, ఎంపీపీ శశిరేఖ, తదితరులు

అల్లూరు, మే 7(అంధ్రజ్యోతి): ఇరు గ్రామాల రైతులు సమన్వయంతో ఎడగారు పంటకు సాగునీటిని వాడుకోవాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ సూచించారు. బుధవారం స్థానిక ఇరిగేషన్ బంగ్లా వద్ద పురిణి, గోగులపల్లి ఆయకట్టు రైతులతో ఆయన సమావేశమయ్యారు. 810 ఎకరాలు విస్తీర్ణం కలిగిన పురిణి చెరువు ఆక్రమణలతో కుంచించుకుపోయి 200 ఎకరాలకు చేరింది ఈ తరుణంలో గోగులపల్లి ఆయకట్టులోని 4 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఈ చెరువు నుంచి ఆక్రమణలతో సాగునీరు అందడం లేదని ఆ గ్రామ రైతులు పురిణి రైతులతో వాగ్వివాదానికి దిగడంతో సమస్యాత్మకంగా మారింది. ఈ సమస్యను బీద గిరిధర్ దృష్టికి తీసుకురాగా ఆయన ఇరు గ్రామాల రైతులతో చర్చించారు. ఇరు ప్రాంత రైతులు ఇబ్బందులు లేకుండా సాగునీటిని సరఫరా చేసుకోవాలని సూచించడంతో రైతులు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, అంబటి రాజేంద్ర, రేబాల శంకర్‌రెడ్డి, సాగునీటి డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

● వ్యవసాయ పరికరాల పంపిణీ

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు బుధవారం జరిగిన వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రాయితీ పరికరాలు అందజేశారు. అర్హులను గుర్తించి యాంత్రీకరణ పనిముట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నాగరాజు, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, పలగాటి శ్రీనివాసులురెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఎంపీడీవో రజనీకాంత్, వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బిట్రగుంట, మే 7(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోవూరుపల్లిలోని కోదండరామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితులు వేదగిరి శ్యామసుందరాచార్యులు, సుబ్బారావు, చిట్టిబాబులు కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి అమ్మవార్లకు పూలంగి సేవకు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ, గ్రామోత్సవ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేం ద్రస్వామి ఆలయంలో బుధవారం 332వ వార్షిక ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, చంద నాలంకారం, గణపతిపూజ, పుణ్యాహ వచనం, బ్రహ్మ కలిశ సకల దేవతల ఆహ్వా నం జరిగాయి. అనంతరం స్వామివారికి సమాధి పూజ, మూర్తి హోమం, సహస్ర నామార్చన నిర్వహించారు. ఆ తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సహస్ర దీపారాధన, కోలాటం, భరతనాట్య ప్రదర్శన జరిగాయి. కార్యక్రమాలను విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు కందు కూరు చెంగయ్య ఆచారి, కందుకూరి జనార్దన్, బాలకృష్ణ ఆచారి, అలిమేలి శ్రీహరి ఆచారి, సురేష్ ఆచారి, రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

టీడీపీలో చేరిన వారికి సముచితస్థానం

● 29వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌కి ఎమ్మెల్యే ఆహ్వానం



29వ వార్డు వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌కు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి

కావలి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆతర రాజకీయ పార్టీల నుంచి టీడీపీలో చేరిన వారికి సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 29వ వార్డు వైసీసీ ఇన్‌చార్జి పెనుమల్లి అశోక్ బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించి. అశోక్ చేరికతో వైసీపీకి ఆ వార్డులో షాక్ తగిలినట్లైంది.

● బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే

పట్టణంలోని వెంగళరావునగర్‌లోని నవవికాస్ వద్ద, శివాలయం సమీపంలో ఉన్న వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం జరిగిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలకు ఉండాలని కోరుకున్నారు. అనంతరం అన్నరసంతర్పణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులతో పాటు టీడీపీ నాయకులు మొగిలి కల్లయ్య, పోతుగంటి అలేఖ్య, పోట్లూరు శ్రీనివాసులు,శానం హరి, నాయుడు రాంప్రసాద్, ధిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



కొండాపురం : పూర్ణకుంభం, కలిశం ఊరేగింపులో భక్తులు

కొండాపురం, మే 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మిలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చిన్నమఠం, పెద్దమఠంలలో ఆరాధన మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. చిన్నమఠం ధర్మకర్త కంచర్ల కేశవచారి ఆధ్వర్యంలో పూర్ణకుంభ, కలశాలతో పవిత్ర జలాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రామానుజపురం, కుంకువారిపాలెం, సత్యవోలు, లింగనపాలెం గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయనిర్వాహకు భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

కావలిరూరల్ : కావలి మండలం కొత్తపల్లి మఠంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొవ్వూరు మాలకొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధన మహోత్సవంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. భక్తులకు మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బిట్రగుంట : బోగోలు మండలం పాతబిట్రగుంట, విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామాల్లోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో స్వామి అమ్మవారలకు ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. మధ్యాహ్నం అన్నసంతర్పణ, రాత్రి గ్రామోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

చెత్త బుట్టల పంపిణీ

కొండాపురం, మే7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మండంలోని గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో బుధవారం ప్రజలకు చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, మాజీ సర్పంచు ఎం.ఏడుకొండలు, కే.రామకృష్ణ, ఐతా వెంకటేశ్వర్లు, పీ.వేణు, తదితరులు పాల్గొన్నారు.



చెత్త బుట్టల పంపిణీ చేస్తున్న జాగర్లమూడి. తదితరులు

ఆర్యవైశ్య విద్యార్థులకు సత్కారం



టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన ఆర్యవైశ్య విద్యార్థులను సత్కరిస్తున్న వాసవీసేవాదళ్ ప్రతినిధులు

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులను వాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథులుగా డాక్టరు ధర్మతేజ, ఆర్యవైశ్యసంఘం జిల్లా కార్యదర్శి గుర్రం సింగయ్య, జిల్లా ఆర్యవైశ్యసంఘం మీడియా చైర్మన్ చక్కా వెంకటకేశవరావు, వాసవీసేవాదళ్ ఉపాధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులు తదితరులు పాల్గొని పదవ తరగతిలో 580 పైగా మార్కులు సాధించిన, ఇంటర్‌లో ప్రథమ సంవత్సరం 96 శాతం, ద్వితీయ సంవత్సరంలో 970కి పైగా మార్కులు సాధించిన 35 మంది విద్యార్థులను సత్కరించి కాలేజీ బ్యాగులు, పెన్నులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, కోట వెంకటనరసింహం, కోట కిషోర్, కంకణాల వెంకటేశ్వర్లు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, రవ్వా అరుణ, పబ్బిశెట్టి వెంకట సురేష్, ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకి నివాళి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ధైర్యసాహసాలను, దేశభక్తిని, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన ధీరోదాత్తతను గుర్తుచేసుకున్నారు. ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా బ్రిటిష్ పాలకులపై పోరాటం సాగించి 27 ఏళ్లకే ప్రాణ త్యాగం చేసిన అల్లూరి తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. అల్లూరి మన నుంచి దూరమై వందేళ్లు గడిచినా నేటికీ ఆయన పేరు తలుచుకుంటే తెలియని ఉద్రేకం వస్తుందన్నారు. నాయకులు గట్టమనేని హరిబాబు, రాఘవులు, మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం వైకుంఠం, బొర్రా కోటేశ్వరరావు, యద్దనపూడి శ్రీధర్, చిన్ని పాండురంగయ్య పాల్గొన్నారు.



మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం బాలాలయంలో కొలువు దీరిన మూలమూర్తులు, ఉత్సవమూర్తులు, ఆళ్వారులు

పునర్నిర్మాణ పనులు నేడు ప్రారంభం

వేణుగోపాలస్వామికి బాలాలయం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా బుధవారం బాలాలయం ప్రారంభమైంది. ప్రధాన ఆలయంలోని మూలవిరాట్లను ధ్యానాధి వాసంలో ఉంచి, ఉత్సవ మూర్తులకు బాలాల యంలో నిత్యపూజలు చేస్తారు. మేల్కోటి భట్టర్ స్వాముల ఆధ్వర్యంలో బాలాలయం పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్త మన్నెం లక్ష్మీకాంతరెడ్డి, ఈవో, సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులు గురువారం నుంచి ప్రారంభిస్తారు.

జూన్ 22న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

కావలిటౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 22వ తేదీన బృందావనం కాలనీలోని కల్యాణ మండపంలో మిస్టర్ సింహపురి స్టీల్ మేన్ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు, ఉమెన్ ఫిజిక్ మోడలింగ్ పోటీలు జరుగుతాయని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడప త్రికను బుధవారం ముసునూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శరీర సౌష్టవ పోటీలను కేవలం పోటీలుగా చూడకూడదని, ప్రతి ఒక్కరు దృఢమైన శరీర సౌష్టవం కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్కే ముజీబ్, ఈసీ మెంబర్లు హరి, పవన్‌కుమార్, బీ.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాల సేకరణలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి

● ఎస్పీ కృష్ణకాంత్



పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నేరాలకు సంబంధించిన భౌతిక ఆధారాల సేకరణలో శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సిబ్బందికి సూచించారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై జిల్లాలో పనిచేస్తున్న దర్యాప్తు అధికారులకు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ నిందితులకు శిక్ష పడటంలో నేర స్థలం నుంచి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాల సేకరణే కీలకమన్నారు. ఆధునిక నేరాలను ఆధునిక పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని, విచారణలో సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తే నేరస్థులను శాస్త్రీయంగా, చట్టపరంగా నిలువరించగలమని తెలిపారు. సేకరించిన ఆధారాలను నిపుణుల పరీక్షలకు పంపే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్ర మంలో ఫోరెన్సిక్ నిపుణులు జయశ్రీ శ్రీరాం, శ్రీరాములు రెడ్డి, కే శిరీష, వీ వెంకటేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ అంటే సేవలకు పెట్టింది పేరు. అందులోనూ నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్‌కు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. మొత్తం 13 రకాల విభాగాలతో ప్రత్యేక సేవలు అందిస్తోంది. కొవిడ్-19 విజృంభణ సమయంలో కరోనా బాధితులకు ప్లాస్మా సేవలు అందించటంలో దేశంలోనే రెండవ స్థానంలో నిలిచింది. ఇక, రక్తదానం సేకరణలో అయితే ఎల్లప్పుడూ ముందే ఉంటుంది. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి పలువురి ప్రశంసలు అందుకుంది.



రెడ్‌క్రాస్ సేవకు బాస్!

- అద్వితీయమైన సేవలు
- జిల్లా రెడ్‌క్రాస్‌కు దేశవ్యాప్త గుర్తింపు
- 13 విభాగాలతో విశిష్ట సేవలు
- రక్తం సేకరణలో రాష్ట్రంలోనే మొదటిస్థానం
- నేడు ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

నెల్లూరు (వైద్యం), మే 7 (ఆంధ్రజ్యోతి) : మొదటి ప్రపంచ యుద్ధానంతరం హెన్రీడ్యూనాట్ అనే మహనీయుడు యుద్ధం వద్దు... శాంతి కావాలనే ధ్యేయంతో ఇంటర్నేషనల్ రెడ్‌క్రాస్ సంస్థను స్థాపించారు. రెండో ప్రపంచ యుద్ధంలో సైనికులకు, బాధితులకు సేవలు అందిస్తూ కాలక్రమేణ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, తీవ్రమైన వ్యాధులు ప్రబలినప్పుడు విశేష సేవలు అందించింది. ఈ నేపథ్యంలో మొదటి శాంతి బహుమతిని పొందిన హెన్రీ డ్యూనాంట్ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ఏటా మే 8వ తేదీన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా రెడ్‌క్రాస్‌లో 7400 మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల సేవలు అందచేస్తున్నారు.

మృతదేహాలకు దహన సంస్కారాలు

కోవిడ్ సమయంలో సొంతవారు సైతం భయంతో శవాలను వదిలేసి వెళ్లగా అటువంటి వారికి రెడ్‌క్రాస్ అంత్యక్రియలు నిర్వహించింది. క్రిమిటోరియం మిషన్ కొనుగోలు చేసి వలంటీర్ల ద్వారా 155 శవాలకు దహన సంస్కారాలు చేసింది. ఆక్సిజన్ రథచక్రాలు పేరుతో ఆక్సిజన్‌తో కూడిన బస్సులను కోవిడ్ బాధితుల కోసం అందుబాటులో ఉంచింది. గత నవంబరులో వరదలు సంభవించినప్పుడు ఆహారం, దుప్పట్లు, నిత్యావసర సరకులు, మంచినీరు అందించింది. రక్తనిధి ద్వారా ఏటా వేలాది మందికి రక్తాన్ని సమకూర్చి వారి ప్రాణాలు నిలవడానికి దోహదపడుతోంది. స్పాస్టిక్ సెంటర్ ద్వారా 100 మంది దివ్యాంగుల బాలలకు ఉచిత వైద్యం అందిస్తోంది. డేకేర్ సెంటర్ ద్వారా తలసీమియా బాధిత 105 మంది పిల్లలకు రక్త మార్పిడి చికిత్సలు అందిస్తోంది. మరణించిన వారి భౌతిక కాయాలను భద్రపరిచేందుకు ఉచితంగా శీతల శవపేటికలు ఏర్పాటు చేసింది. ఇక, కేన్సర్ విభాగం ద్వారా అయితే జిల్లాతోపాటు చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, కడప జిల్లా రోగులకు కూడా చికిత్సలు అందిస్తోంది.

రెడ్‌క్రాస్ విభాగాలు ఇవి...

బ్లడ్‌బ్యాంకుతోపాటు కేన్సర్ విభాగం, ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్‌క్రాస్, డిసాస్టర్ మేనేజ్ మెంట్, జనరిక్ మెడిసిన్, ఏఆర్‌వీ క్లినిక్, తలసీమియా విభాగం, వైఆర్‌జీ కేర్, సోషల్ ఎమర్జెన్సీ, పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం తదితర విభాగాలలో రెడ్‌క్రాస్ విశిష్ట సేవలు అందిస్తుంది.

మరింత సేవ చేస్తాం



నెల్లూరు రెడ్‌క్రాస్ ద్వారా రోగులకు అవసరమైన రక్తంతోపాటు ప్లాస్మా వంటివి సరఫరా చేస్తున్నాం. మొత్తం 13 విభాగాల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నాం. దీని వెనుక దాతల సహకారం ఎంతో ఉంది. కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించాం. భవిష్యత్తులో మరింత ఎక్కువ సేవ చేస్తాం.

- వాకాటి విజయకుమార్‌రెడ్డి, రెడ్‌క్రాస్ పాలకమండలి చైర్మన్

ఒకరి ఆకలి తీర్చడమైనేది ఎవరికైనా తృప్తినిచ్చే అంశం. అలా ఎంతో మంది ఆకలి తీరుస్తూ తర్వాత ఉపాధి, ఆదాయం పొందే వ్యాపారాన్ని పొదుపు మహిళలు ప్రారంభించారు. వారికి చేయూతనిచ్చి ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి ప్రభుత్వం తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు నిర్ణయించింది. రాష్ట్రంలోనే మొట్టమొదట నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ వద్ద ఈ క్యాంటీన్‌ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఇది సత్ఫలితాలను, మంచి ఆదాయాన్ని ఇస్తుండటంతో జిల్లా వ్యాప్తంగా మహిళలతో మరిన్ని క్యాంటీన్లు నడిపించాలని మెప్మా అధికారులు నిర్ణయించారు. ఏపీ మెప్మా, సారా ప్రాజెక్టు ఉమ్మడి భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.



తృప్తినిచ్చే ఉపాధి

- పొదుపు మహిళలతో క్యాంటీన్లు
- ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వ చేయూత
- నలుగురితో జట్టుగా ఏర్పాటు
- పైలెట్ ప్రాజెక్టుగా నెల్లూరులో ప్రారంభం
- సౌర విద్యుత్ వినియోగం
- మరిన్ని ఏర్పాటు చేస్తామంటున్న అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : తృప్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వమే 20-12 సైజు కంటైనర్లను సమకూరుస్తుంది. నలుగురు మహిళా సభ్యులను ఒక యూనిట్‌గా తీసుకుని వారికి తృప్తి క్యాంటీన్లను అప్పగిస్తుంది. వంటశాల నిర్వహణపై శిక్షణ ఇస్తుంది. పర్యావరణహితాన్ని కాంక్షిస్తూ ఈ క్యాంటీన్లో ఎలక్ట్రిక్ పరికరాలను, సౌర విద్యుత్‌తో పనిచేసే వాటిని ఉపయోగిస్తోంది. క్యాంటీన్ నిర్వ హణకు రూ. 16.40లక్షలు పెట్టుబడి అవసరమవుతుందని అధికారులు నిర్ణయించారు. నలుగురు సభ్యుల్లో ఒక్కొక్కరు రూ.3.10లక్షల వంతున రూ.12.40 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుది. మిగతా పెట్టుబడి కంటైనర్, యంత్ర పరికరాలు, సూర్య ఘర్ పథకం కింద సౌర విద్యుత్, ఇతర అవసరాల రూపంలో మెప్మా, సారా ప్రాజెక్టులు అందజేస్తాయి.



తృప్తి క్యాంటీన్ లోపల సామాన్లు

ఈ క్యాంటీన్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయం ఉంటుంది. అనుభవజ్ఞులైన వంటవారు సేవలు అందిస్తారు.

● లాభదాయకమే..!

తృప్తి క్యాంటీన్ నిర్వహణకు సంబంధించి ఆదాయ, వ్యయాలను అధికారులు లెక్కకట్టారు. వారి అంచనా ప్రకారం నెలవారీ టర్నోవర్ రూ.6.39లక్షలుకాగా అందులో ఖర్చులు రూ.3.92లక్షలుపోగా మిగిలిన రూ.2.46లక్షలు ఆదాయంగా పేర్కొన్నారు. అయితే ఈ క్యాంటీన్లలో ఆహార పదార్థాల ధరలకు బయటి మార్కెట్‌లో ధరలకు పెద్దగా వ్యత్యాసం లేకపోవడం గమనార్హం.

ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేస్తాం



రాష్ట్రంలోనే మొట్టమొదటి తృప్తి క్యాంటీన్‌ను నెల్లూరులో ఏర్పాటు చేశాం. ఆదాయం బాగా వస్తోంది. నగరంలోని ప్రధాన కూడళ్లలో మరిన్ని ఏర్పాటు చేయిస్తాం. తర్వాత కార్పొరేషన్, మున్సిపాలిటీల్లోనూ ఈ క్యాంటీన్లు ఎక్కువ సంఖ్యలో ప్రారంభిస్తాం.

- రాధమ్మ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

సమస్యలను పరిగణలోకి తీసుకుని రీ సర్వే పూర్తి చేయాలి

నెల్లూరు (హరనాథపురం), మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటికే రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని సమర్థవంతంగా సర్వేను పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో రీసర్వేపై సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ రెండవ విడత ఎంపికైన గ్రామాల్లో రీ సర్వే సక్రమంగా పూర్తి చేయాలని, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని, అందుకుగాను ముందుగా రెవెన్యూ కార్యాలయంలో అందుబాటులో ఉన్న రికార్డుల జాబితా తయారు చేయాలని సూచించారు. నోషనల్ ఖాతాలను సాధారణ ఖాతాలుగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి తీరువా పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం పనికిరానిదని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్‌వో ఉదయ భాస్కర్‌రావు, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, సర్వే ఏడీ నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీ దుర్గాభవాని జ్యోతిష్యాలయం

శ్రీ దుర్గాభవాని జ్యోతిష్యాలయము. కుటుంబ, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యాభర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పబడును. శ్రీదుర్గ హోటల్ ఎదురుగా, స్టోన్‌హౌస్‌పేట నె.ప్ర. సెల్: 9704249338

AJR-205590

For Lease

కార్‌వాష్ అద్దెకు ఇవ్వబడును. అన్ని వసతులతో కూడిన రన్నింగ్ వున్న కారు వాష్ స్పేషన్ అద్దెకు ఇవ్వబడును. సం.ప్ర. సెల్: 89199 58802, 93978 90007

AJR-Kishore Kumar

WANTED

» అమేజాన్ అసోసియేట్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించడం - రిఫరల్ ఆధారిత ఆదాయాలు. జీతం : 15-20 వేలు వరకు సంప్ర. 63017 21339

AJB-83

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

11 ఎర్రచందనం దుంగల పట్టివేత

అనంతసాగరం, మే 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గుడిగుంట బీట్ ఉత్తర కాలువ సమీపంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 11 ఎర్రచందనం దుంగలను బుధవారం సాయంత్రం అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. వాటిని ఆత్మకూరు రేంజి కార్యాలయానికి తరలించారు. వాటి బరువు 300 కేజీలు ఉన్నట్లు జిల్లా అటవీశాఖాధికారి మహబుబ్‌బాష తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



పట్టుకున్న ఎర్రచందనం దుంగలు

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు, వర్సిటీ వీసీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

వెంకటాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ లీగ్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కొంతసేపు సాఫ్ట్‌బాల్ ఆడారు. తొలుత మంత్రికి వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఘనస్వాగతం పలికి సత్కరించారు. అనంతరం టోర్నమెంట్ విజయవంతానికి సహకరించిన దాతలను మంత్రి సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ సీఎం చంద్రబాబు క్రీడల పట్ల ఎంతో చిత్తశుద్ధితో ఉన్నారని, అందుకే గతంలో రెండు శాతం ఉన్న క్రీడల కోటా రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచినట్లు తెలిపారు. ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో 16 వేలకుపైగా పోస్టులు ఉండగా, క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా 421 పోస్టులను నోటిఫై చేసినట్లు ఆయన గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్నీ జిల్లాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, స్టేడియాలను నిర్మించి, అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోటీ పడుతున్న క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరింతగా రాణించేందుకు తోడ్పడతామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ యూనివర్సిటీల కోచ్‌లు, అంపైర్లు, రెఫరీలు తదితరులు పాల్గొన్నారు.

● నేడు టోర్నీ ముగింపు

వీఎస్‌యూలో జరుగుతున్న అఖిల భారత అంతర యూనివర్సిటీల పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ తుదిదశకు చేరుకుంది. ఈ పోటీల్లో భాగంగా నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ, మహారాష్ట్రలోని సంత్ గాడ్గే బాబా అమరావతి యూనివర్సిటీ, కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్, కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ జట్లు గురువారం పరస్పరం తలపడను న్నాయి. ఈ జట్లకు జరగనున్న మ్యాచ్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాల్గవ స్థానాలు ఖరారు కానున్నాయి. గురువారం సాయంత్రం 4 గంటలకు వీఎస్‌యూ ప్రాంగణంలో ముగింపు వేడుక జరగనుంది. పలువురు ప్రముఖులు హాజరై విజేతలకు ట్రోఫీలను అందచేయనున్నారు.

క్వార్ట్జ, మైకాకు భలే డిమాండ్

- ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు ఉపాధి
- చైనాకు ఎగుమతి చేయడం వల్ల నష్టాలు
- నెల్లూరు మైనింగ్ యజమానులు

విజయవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం క్వార్ట్జ్, మైకాకు మంచి డిమాండ్ ఉందని, వీటిని చైనాకు పంపి ప్రాసెసింగ్ చేయడం వల్ల తాము నష్టపోతున్నామని నెల్లూరు జిల్లా క్వార్ట్జ్, మైకా మైన్స్ ఓనర్ మాల్యాద్రి అన్నారు. బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నెల్లూరులో అపారమైన ఖనిజ సంపద ఉందన్నారు. ఈ ఖనిజ సంపదను సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చైనాకు ఎగుమతులు నిలిపివేసి నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడం వల్ల స్థానిక యువతకు ఎక్కువగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటికే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ గనులను రీసర్వే చేసి అరవై మైనింగ్ గనులకు అనుమతి ఇచ్చారని, మరో పన్నెండు ప్రదేశాల్లో అనుమతి ఇవ్వాల్సి ఉందని మాల్యాద్రి చెప్పారు. 2024 నుంచి క్వార్ట్జ్, మైకా గనుల్లో పనులు జరగకపోవడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయాన్నారు. కొంతమంది అడ్డదారుల్లో క్వార్ట్జ్ ముడిసరుకు తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని మైనింగ్ యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ యజమానులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న క్వార్ట్జ్, మైకా మైన్స్ ఓనర్ మాల్యాద్రి

జలజీవన్ పనులు వేగవంతం చేయాలి

- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు
- గ్రామీణ నీటిసరఫరాశాఖ ఈఈ రెడ్డయ్య



కొలనుకుదురు వద్ద కొత్త పైపులైనును పరిశీలిస్తున్న ఈఈ రెడ్డయ్య

మనుబోలు, మే 7(ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో తలపెట్టిన జల జీవన్ పనులు వేగ వంతం చేయాలని జిల్లా గ్రామీణ నీటిసరఫరాశాఖ ఈఈ రెడ్డయ్య తెలిపారు. మండలంలోని తీర ప్రాంత గ్రామాలైన కొలనుకుదురు, పల్లిపాళెంలో జరుగుతున్న జలజీవన్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లిపాళెంలో రూ.39లక్షలతో రక్షిత మంచినీటి ట్యాంకు, కొలనుకుదురులో రూ. 68లక్షలతో కొత్తవాటర్ స్కీం,సంపునిర్మాణం, పైపులైను పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణాలకు వాడే సిమెంట్, ఇసుక, స్టీల్‌ను పరిశీలించామని చెప్పారు. పనులు నాణ్యత తగ్గకుండా చేయించాలని ఏఈకి, కాంట్రాక్టరుకు సూచించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. అంతేకాక మండలంలో పలు గ్రామాల్లో రక్షితమంచినీటి ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ కసనానాయక్, నాణ్యత నియంత్రణ ఏఈ ఎన్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్‌జీటీ, ఎస్ఏ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెరిట్ ప్రాతిపదికన ఉపాధ్యాయులు తెలిపిన అభ్యంతరాల పరిశీలన తరువాతనే తుది జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఎస్ఏల నుంచి హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కోసం సీనియారిటీ జాబితాను కూడా డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచామని, వీటిపై మరిన్ని అభ్యంతరాలుంటే ఈనెల 9వతేదీ వరకు దరఖాస్తులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందచేయవచ్చని తెలిపారు.

డైట్ అధ్యాపకులుగా ఉపాధ్యాయులు

● 20 మందికి డిప్యుటేషన్

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : డైట్ కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు 20 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను ఫారెన్ సర్వీస్ కింద డిప్యుటేషన్‌పై నియమించినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీచేశారు.

దుకాణాల వేలం వాయిదా

బుచ్చిరెడ్డిపాళెం,మే7(ఆంధ్రజ్యోతి):నగర పంచాయతీలోని డాక్టర్ బెజవాడ గోపాల్‌రెడ్డి పార్కు వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు బుధవారం వేలం నిర్వహించాల్సి ఉండగా, పాటదారులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్టు కమిషనర్ బాలకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్కు షాపింగ్ కాంప్లెక్స్‌లో 9,10 దుకాణాలకు వేలంలో పాటదారులు పాల్గొనకపోవడంవల్ల వాయిదా వేసినట్టు తెలిపారు. నగర పంచాయతీలో 33 రూములకుగాను 29 రూములకు వేలం నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. మిగిలిన 4 షాపులకు ఈనెల 12న వేలం నిర్వహిస్తామని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9371
వెండి కిలో ధర	రూ. 98,800
వెండి ఒక గ్రాము	రూ.101.80

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

● మట్టి నమూనాల సేకరణకు ప్రాధాన్యం ● ఆర్‌ఎస్‌కేల పరిధిలో విస్తృతంగా నిర్వహణ ● ఖరీఫ్‌కు ముందే రైతులకు ఫలితాలు

ముత్తుకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): సాగులో అధిక దిగుబడులు సాధించేందుకు, అవసరమైన రసాయనాలను వినియోగించేందుకు, మట్టి స్వభావం ఆధారంగా పంటల సాగుకు భూసార పరీక్షలు ఎంతో ముఖ్యం. అత్యంత కీలకమైన ఈ పరీక్షలు గత నాలుగేళ్లుగా అటకెక్కాయి. నేల సారవంతంపై అవగాహన లేకుండానే రైతులు విచ్చలవిడిగా ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగి, పోషకాలు తగిన రీతిలో అందక భూమి నిస్సారమైపోతున్నది.

● **ప్రభుత్వం అధిక ప్రాధాన్యం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పరీక్షలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. భూసార పరీక్షలు చేసేందుకు వేసవికాలం అనుకూలంగా ఉంటుంది. ఖరీఫ్‌కు ముందే మట్టి పరీక్షలు చేయాలని వ్యవసాయాధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఆయా రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కేల) వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇందుకూరుపేట వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలో ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల్లో భూసార పరీక్షలకు సంబంధించి విస్తృతంగా మట్టి నమూనాలను గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏలు) సేకరిస్తున్నారు.

● **నేల సమతుల్యత కాపాడేందుకు..**

ఎక్కువమంది రైతులు తమ పొలంలో నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వీటిని అధికంగా వినియోగించడంతో నేలల్లో క్రమంగా సమతుల్యత లోపిస్తుంది. పోషకాలు ఉంటేనే మొక్కల ఎదుగుదలకు అనువుగా ఉంటుంది. ఇందులో జింకు, ఐరన్, నైట్రోజన్, కాల్షియం, కాపర్, సల్ఫర్, బోరాన్, కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్ వంటివి ఉంటాయి. అన్నీ నేలల్లో ఇవి సమానంగా ఉండనందున వీటి నిర్ధారణకు భూసార పరీక్షలు తప్పనిసరి. ఇందుకోసం కూటమి ప్రభుత్వం మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నది. సాగుకు భూసారం సమతుల్యంగా ఉన్నప్పుడే మొక్క ఎదుగుదల బాగా ఉంటుంది. దిగుబడులు కూడా నాణ్యతగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచిక, లవణ పరిమాణం, నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను ఈ భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయన ఎరువుల వాడకం పెరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్షల ఫలితాలు మేరకు పోషకాలు అందించి దిగుబడులు పెంచుకోవచ్చు.



భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్ తదితరులు (ఫైల్)

వైమానిక దాడులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

ముత్తుకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా శత్రు దేశాలు వైమానిక దాడులు చేస్తే అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. అదానీ కృష్ణపట్నం పోర్టులో బుధవారం పోలీసు అగ్నిమాపక శాఖతోపాటు కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటీ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అనుకోని పరిస్థితుల్లో వైమానిక దాడులు జరిగితే ప్రజలకు తమ వ్యక్తిగత భద్రత, రక్షణపై అవగాహన కల్పించేందుకే మాక్‌డ్రిల్ నిర్వహించామన్నారు. పోర్టుతోపాటు థర్మల్ కేంద్రాలు, పామాయిల్ పరిశ్రమలు, పవర్ గ్రిడ్లు ఉన్నందున్న ఈ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోర్టు సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ మృత్యుంజయరామ్, కృష్ణపట్నం సీఐ రవినాయక్, ఎస్‌ఐలు శ్రీనివాసులురెడ్డి, విశ్వనాథరెడ్డి, మెరైన్ సీఐ ప్రసాద్, ఐఎస్ అంజిరెడ్డి, తహసీల్దారు స్వప్న, తదితులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు, పోర్టు సెక్యూరిటీ

చలివేంద్రం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, మే 7 (ఆంధ్రజ్యోతి): కట్టుబడిపాళెంలో బుధవారం దాత షేక్ ఖాజా రహంతుల్లా సహకారంతో యువత ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ చీదరాల చెన్నయ్య, గుంజి భువనేశ్వరకుమార్, వెంకటరమణయ్య, రామిశెట్టి సుబ్రహ్మణ్యం, రాజశేఖర్, తూపిలి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెపక్ తక్రా పోటీలకు ప్రకాష్



ముత్తుకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామానికి చెందిన బాపనపాటి ప్రకాష్ జాతీయ బీచ్ సెపక్ తక్రా పోటీలకు ఎంపికయ్యారు. ప్రకాష్ స్థానిక వీబీఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌ను వీబీఆర్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ రమేష్ అభినందించారు. కర్నూలులో మంగళవారం జరిగిన ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి బీచ్ సెపక్ తక్రా పోటీల్లో పాల్గొని జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఈనెల 19 నుంచి 24 వరకు గుజరాత్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నారు.

కొత్త పుస్తకాలు వచ్చేశాయోచ్!

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యాసంవత్సరం ఇంకా నెల ఉండగానే బుధవారం మండల కేంద్రానికి పాఠ్యపుస్తకాలు చేరాయి. ఈ దఫా కొత్త పుస్తకాలు ముందుగానే ప్రభుత్వం ప్రింట్ చేసి అందించింది. మండలానికి 13,418 పుస్తకాలు రావాల్సి ఉండగా, 12,366 పుస్తకాలు వచ్చాయి.

కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ జేఎల్స్ కొనసాగింపు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల సర్వీసును పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 3,572 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు, 379 మంది పార్ట్‌టైమ్ జూనియర్ లెక్చరర్ల సర్వీసును ఏడాదిపాటు పొడిగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. జూన్ 1 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు పదకొండు నెలలపాటు ఈ ఒప్పందం అమల్లో ఉంటుంది. 60 ఏళ్లు నిండిన 47 మంది కాంట్రాక్టు జేఎల్స్ సర్వీసు పొడిగించలేదు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై వేడుకలు

కోవూరు, మే7 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులపై భారతసైన్యం చేసిన వైమానికి దాడిని హర్షిస్తూ బుధవారం రాత్రి పలు పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువకులు స్థానిక బజారుకూడలిలో వేడుకలు నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మిఠాయిలు పంచి ఆనందంతో నినాదాలు చేశారు. వైమానిక దాడుల్లో పాల్గొన్న సైనికులకు అభినందనలు తెలిపారు. ఈ వేడుకల్లో నాయకులు ఇండ్ల రాఘవేంద్ర, గాదిరాజు చక్రవర్తి, అశోక్‌కుమార్, గాదిరాజు భాస్కర్, పోలిశెట్టి సుబ్బారావు, ఇంతా మల్లారెడ్డి, సూరిశెట్టి శ్రీనివాసులు, పూడి ప్రసాద్, గాదిరాజు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు పంచుతున్న రాజకీయ నాయకులు

50శాతం రాయితీపై సమీకృత దాణా పంపిణీ

మనుబోలు, మే 7(ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు 50శాతం రాయితీపై ప్రభుత్వం సమీకృత దాణాను అందచేస్తున్నదని మనుబోలు నీటి సంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో బుధవారం రైతులకు సమీకృత దాణా బస్తాలను అందించారు. ఈ సందర్భంగా ఏడీ గురవారెడ్డి మాట్లాడుతూ మండలానికి 7టన్నుల సమీకృతదాణాను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అందులో మనుబోలు, చెర్లోపల్లికి 1.5టన్నుల దాణా వచ్చిందన్నారు. ఈ సమీకృత దాణా పశువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మనుబోలు విజయ డెయిరీ సెంటర్ అధ్యక్షుడు పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి, పశువైద్యశాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు దాణా అందిస్తున్న నీటి సంఘం అధ్యక్షుడు రామిరెడ్డి

ముగిసిన ఎన్‌సీసీ శిబిరం

వెంకటాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరస్వతినగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే ఆధ్వర్యంలో పదిరోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు, మెడల్స్‌ను ప్రదానం చేశారు. అనంతరం గణేష్ గొడంగవే మాట్లాడుతూ ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయం చేసేతత్వం అలవడతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు గుండాల నరేంద్రబాబు, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, అరోరా, సాయిశంకరి, దివ్య, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభకనబరిచిన ఎన్‌సీసీ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న కమాండర్ గణేష్ గొదంగవే

ఇంగిలాల విజ్ఞేష్‌కు సోమిరెడ్డి పరామర్శ

తోటపల్లిగూడూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇసుకపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఇంగిలాల విజ్ఞేష్ కొంతకాలంగా అనారోగ్యంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. దీంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం వైద్యశాలకు వెళ్లి విజ్ఞేష్ పరామర్శించి, వైద్యులనడిగి చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ఇంగిలాల కుటుంబానికి మనోధైర్యం నింపారు. ఆయన వెంట ఇసుకపాలెం సర్పంచి ఇంగిలాల చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీ నేతకు పరామర్శ**

వెంకటాచలం, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుపూరుకి చెందిన టీడీపీ మాజీ మండల ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి ధనుంజయ నాయుడు తల్లి కాంతమ్మ (78) అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో బుధవారం వారి నివాసానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చేరుకుని, ధనుంజయ నాయుడికి పరామర్శించి, ఆయన తల్లి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం ధనుంజయనాయుడు సోదరుడు కనుపూరు మాజీ సర్పంచి వెంకటేశ్వర్లు నాయుడిని సైతం పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు వల్లూరు రమేష్‌నాయుడు, వల్లూరు వంశీకృష్ణ, లంక సాయినాయుడు, కనుపూరు కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మస్తాన్‌నాయుడు, తదితరులు ఉన్నారు.



ఇంగిలాల విజ్ఞేష్‌ను పరామర్శిస్తున్న సోమిరెడ్డి

రేపటి నుంచి ఎండ మంటలే !

● కొనసాగుతున్న వాతావరణ అనిశ్చితి
● ఓవైపు వర్షాలు.. మరోవైపు ఎండ

అమరావతి, విశాఖపట్నం, మే 7(ఆంధ్రజ్యోతి): వాతావరణ అనిశ్చితితో రాయలసీమ, కోస్తాల్లో ఎండ తీవ్రత, వర్షాలు కొనసాగుతున్నాయి. కోస్తా, రాయలసీమల్లో బుధవారం పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 86.25మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం అంతకంటే ఒకటి నుంచి రెండు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కోస్తా, రాయలసీమల్లో ఎండలు పెరుగుతాయని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. కాగా, గురువారం 40-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకానుండగా, శుక్రవారం నుంచి ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. గురువారం పలుచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని, ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం 15 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 28 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు ఉంటాయని పేర్కొంది. బుధవారం కడప జిల్లా సింహాద్రిపురంలో 40.7, నంద్యాల జిల్లా గుల్లదుర్తి, కర్నూలు జిల్లా నేమకల్లులో 40.6, పల్నాడు జిల్లా కాకానిలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కార్పొరేట్‌కు దీటుగా సంక్షేమ విద్యాసంస్థలు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమశాఖ గురుకులాలు, హాస్టళ్లు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి అన్నారు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు, టీచర్లకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం నగదు బహుమతులు, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. తొలిసారిగా ఇలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నామన్నారు. పేద విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. హాస్టళ్లలో మరమ్మత్తులు, మౌలిక వసతుల ఏర్పాట్లకు రూ. 143 కోట్లు ఖర్చు చేశామన్నారు. నీట్‌లో ఉచిత కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది నుంచి 10కి పెంచుతామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు రెండు నెలలకు ఒకసారి కాస్మోటిక్ కిట్స్, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామన్నారు. గిరిజన విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిభను చాటుతూ అత్యుత్తమ ఫలితాలను సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.

న్యూస్ బాక్స్

గాంధీ ఆశ్రమంలో ఠాగూరు జయంతి, అల్లూరి వర్ధంతి

ఇందుకూరుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీఆశ్రమంలో బుధవారం కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో జాతీయగీతం రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల, గంటా విజయశ్రీ, ఠాగూర్ చిత్రపటానికి, అల్లూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కోకన్వీనర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఒక్కొక్కరు ఒక్కోవిధంగా పోరాటం చేశారని వివరించారు. వారి త్యాగాల ఫలితమే నేటి మన స్వేచ్ఛాజీవనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కందికట్టు రాజేశ్వరి, షేక్.అల్లాబక్షు, ఆశ్రమ మేనేజర్ మనోజ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'విదేశీ విద్య' పునరుద్ధరణ అభినందనీయం : చేజర్ల



కోవూరు, మే7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు విదేశీవిద్య పథకాన్ని పునరుద్ధరించడం అభినందనీయమని టీడీపీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ,బీసీ, ఈబీసీ విద్యార్థుల సంక్షేమం కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం సంతోషదాయకమన్నారు. బేబీ కిట్స్ పథకాన్ని పునరుద్ధరించడం వల్ల ప్రతి ఏటా 4లక్షలమంది తల్లులకు రూ.లక్షలు విలువ చేసే ఆహార పదార్థాల్ని ఉచితంగా అందిస్తారని ఆయన వివరించారు.

16న న్యాయవాదుల ఎన్నికలు

కోవూరు, మే7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక న్యాయవాద సంఘానికి ఈనెల 16న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి సీహెచ్ తిరుమలేష్ బుధవారం తెలిపారు. అధ్యక్ష, ప్రధానకార్యదర్శుల పోస్టులకు బుధవారం స్రూటీ్ని ముగిసిందని చెప్పారు. అధ్యక్షపదవికి ఏ చెన్నయ్య, పీ సునీల్, ప్రధాన కార్యదర్శి పోస్టుకు పీ బాబు, సీహెచ్ చంద్రమోహన్ పోటీపడుతున్నట్లు ఆయన వివరించారు.

కండలేరు ఎడమ కాలువకు నీరు విడుదల



ఎడమ కాలువకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

పొదలకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ఎడమ కాలువ కింద ఉన్న చెరువులకు 80 క్యూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్టు కండలేరు అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు తెలిపారు. పశువుల తాగునీటి కోసం ఈ నీరు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులిపాటి వెంకటరత్నంనాయుడు, కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, కండే సురేష్ యాదవ్, పెంచలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసురక్ష ఆసుపత్రి ప్రారంభం



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం,మే7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీసురక్ష ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ గుత్తా శంతన్‌హర్ష, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, మాజీ ఎంపీటీసీ పర్వీనా, స్థానిక వైద్యులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

పొదలకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు ఎస్సీ కాలనీకి చెందిన వసంతరాయులు అనే రెండో తరగతి విద్యార్థి వారం రోజులుగా డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నాడు.దీంతో బీటీఏ నాయకులు నెల్లూరులో చికిత్స పొందుతున్న ఆ చిన్నారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15,500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఊట్ల రఘు, వడ్డే హజరత్తయ్య, శ్రీనయ్య, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

రియల్టర్ హత్య కేసు ముమ్మర దర్యాప్తు

● ప్రత్యేక బృందాలతో విచారణ



హత్య జరిగిన ఇంటిలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేదాయపాళెం వెంకటరెడ్డి నగర్‌లో మంగళవారం జరిగిన రియల్టర్ చిన్నయ్య హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డాగ్‌స్క్వాడ్, ఫింగ్స్ బృందం ఘటన స్థలంలో ఆధారాలను సేకరించాయి. చుట్టుపక్కల సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. మంగళవారం రాత్రి ఏఎస్పీ సీహెచ్ సౌజన్య వేదాయపాళెం స్టేషన్‌కు చేరుకొని హత్య జరిగిన తీరు, సేకరించిన సాక్ష్యాలు, ఇతర అంశాలపై నగర డీఎస్పీ సింధుప్రియ, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రోశయ్య, అధికారులతో చర్చించారు. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను నియమించారు. బుధవారం ఎస్పీ జీ కృష్ణకాంత్ హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. డాగ్‌స్క్వాడ్ సైతం మరోమారు ఘటన స్థలంలో ఆధారాల కోసం ప్రయత్నించింది. కాగా, ఈ కేసును పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగిన సమయంలో ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఉన్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును పోలీసులు విచారి స్తున్నారు. అతను చెప్పే సమాధానాలు పొంతన లేకుండా ఉన్నట్లు సమాచారం.

ఉదయగిరిలో విచారణ

ఉదయగిరి (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామానికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య నెల్లూరులో దారుణహత్యకు గురికావడంతో బుధవారం నెల్లూరు నుంచి వచ్చిన సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ముత్యాలరావు ఉదయగిరిలో విచారణ చేపట్టారు. హత్యకు గురైన చిన్నయ్య సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా సీతారామపురం మండలానికి చెందిన ఓ మహిళతో అత్యధిక సార్లు మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆమెను విచారించి వివరాలు సేకరించినట్లు తెలిసింది. అలాగే ఉదయగిరి పట్టణానికి చెందిన మరో మహిళ చిన్నయ్య వద్ద నెల్లూరులో ప్లాట్‌ను కొనుగోలు చేయడం, దానికి సంబంధించి రిజిస్ట్రేషన్ విషయంపై చిన్నయ్యను హత్యకు ముందురోజు కలవడంతో పోలీసులు ఆమెను సైతం ఫోన్‌లో విచారించినట్లు సమాచారం.

కక్ష సాధింపుతోనే రఫీ హత్య

● 8మంది నిందితుల అరెస్టు
● మారణాయుధాల స్వాధీనం : సీఐ



అరెస్టు చేసిన నిందితులతో కలసి కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం, మే 7 (ఆంధ్రజ్యోతి): కక్షసాధింపు, ఆధిపత్యపోరుతోనే మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామానికి చెందిన ఎస్‌కే.పెద్ద రఫీని నిందితులు హత్య చేసినట్టు తమ విచారణలో తేలిందని సీఐ శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈ కేసులో 8మంది నిందితులను అరెస్టు చేసి బుధవారం కోర్టుకు హాజరు పరచగా, రిమాండుకు తరలించినట్టు ఆయన వెల్లడించారు.నిందితులు హత్యకు వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం బుచ్చి స్టేషన్‌లో ఆయన విలేకరులకు కేసు వివరాలు తెలియజేశారు. పోలినాయుడుచెరువు గ్రామంలో రెండు వర్గాల మధ్య పదేళ్లుగా ఘర్షణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక వర్గానికి దాదాసాహెబ్, మరో వర్గానికి పెద్దరఫీ లీడర్లుగా ఉన్నారు. జనవరిలో జరిగిన గంధమహోత్సవంలో వీరి మధ్య వివాదాలు తలెత్తి గొడవ పడ్డారు. అంతేకాక పొలం విషయమై కూడా వివాదం ఉంది. వీటన్నింటికీ రఫీనే ప్రధాన కారణంగా భావించి, అతన్ని చంపేస్తే తమ ఆధిపత్యానికి అడ్డొచ్చేవారుండరనే ఉద్దేశంతో ప్రత్యుర్థులు రఫీని హత్య చేసినట్టు సీఐ వెల్లడించారు. దాదాసాహెబ్ హత్యకు ప్రోత్సహించగా అతన్ని, నిందితులకు నెల్లూరులోని రంగనాయకుల పేటలో షెల్టర్ ఇచ్చిన షఫీ అలియాస్ షోరాను అరెస్టుచేసినట్టు ఆయన తెలిపారు. వీరితోపాటు మరో ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మే 7 (ఆంధ్రజ్యోతి) : వివాహం జరిగి సంవత్సరాలు గడుస్తున్నా పిల్లలు పుట్టలేదన్న బాధ, బ్యాంకులో పని ఒత్తిడితో బ్యాంకు ఉద్యోగి మంగళవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన బత్తుల వీరేంద్ర(29)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఓ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వివాహం జరిగి రెండేళ్లయినా పిల్లలు పుట్టలేదని, బ్యాంకులో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని పదేపదే కుటుంబ సభ్యులకు చెప్పుకొని బాధపడేవాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో జాతీయ రహదారి వంతెన వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మతిస్థిమితంలేని వృద్ధుడి మృతి

దుత్తలూరు (ఉదయగిరి), మే 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలోని 565 జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన జంపు వెంగయ్య (60) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతూ జాతీయ రహదారికి సమీపంలో ఉండే సత్రంలో ఉండేవాడని, తెల్లవారుజామున రోడ్డుపై వెళ తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందు కున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	242
స్కిన్‌లెస్	266

కోడిగుడ్ల ధర (100): 500

దొంతాలికి రోడ్డేస్తున్నారు..!

నెల్లూరు రూరల్లోని దొంతాలి గ్రామానికి ఎట్టకేలకు రోడ్డేశారు. ఏడాదిన్నరగా రోడ్డు నిర్మిస్తామని చెప్పి అధికారులు మట్టినితవ్వి కంకర, క్వారీడస్ట్ పోసి సరిపెట్టేశారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం ప్రజలకు నరకంగా మారింది. గ్రామస్థుల ఇక్కట్లను ఆంధ్రజ్యోతి ఇటీవల వెలుగులోకి తీసుకువచ్చింది. దీనికి స్పందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు బుధవారం రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మలిసేని వెంకయ్య నాయుడు పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు.

- నెల్లూరురూరల్(ఆంధ్రజ్యోతి)



ఎడగారులోనూ వరే!

● పూర్తి విస్తీర్ణం సాగుకు రైతుల సన్నద్ధం ● నారు కయ్యల దుక్కిలో బిజీబిజీ ● రబీలోని వంగడాలే మళ్లీ...



నారు కయ్యలు దున్నుతున్న ట్రాక్టర్

నెల్లూరు రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఎడగారు సీజన్‌లో మళ్లీ వరి పంటనే సాగుచేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాగునీటిని రెండో పంటకు కొంతమేర అంది స్తామంటూ ఇటీవల నిర్వహించిన ఐఏబీలో అధికారులు ప్రకటించడంతో కర్షకులు నారు కయ్యలను సిద్ధం చేస్తున్నారు. పూర్తి విస్తీర్ణం సాగు చేసేందుకు, అదికూడా ఇటీవల ముగిసిన రబీలో సాగు చేసిన సన్నరకాలనే మళ్లీ పండించేందుకు విత్తనాలు సేకరిస్తున్నారు. వ్యవసాయ శాఖ కూడా వాటినే సూచిస్తోంది. అయితే నీటి లభ్యతకు అనుగుణంగానే విస్తీర్ణ ఉండాలని అధికారులు కచ్చితంగా చెప్తున్నారు.

నెల్లూరు రూరల్లో కనుపూరు కాలువ ప్రధాన సాగునీటి వనరు కాగా, తూర్పు పక్క పల్లెలకు సర్వేపల్లి, జాఫర్‌సాహెబ్, లేబూరు, కృష్ణపట్నం కాలువల నుంచి సాగునీరు పారుతుంది. వీటన్నింటికీ పూర్తి ఆయకట్టు మేర కాకపోయిన అందులో కొంత మేర సాగునీటిని విడుదల చేస్తామని ఇటీవల జరిగిన ఐఏబీలో నిర్ణయం వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు వరుసగా రెండో పంటగా కూడా వరినే సాగు చేయడానికి పూనుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ సన్నరకాలనే పండించాలని భావిస్తున్నారు. రబీలో ప్రధానంగా సాగుచేసిన కేఎన్ఎం రకాన్నే ఇప్పుడు కూడా పండించనున్నారు. కేఎన్ఎం- 1638 రకాన్ని రబీలో ఎక్కువ మంది సాగుచేయగా ఆ రకంతోపాటు 733, ఎం -7 రకాలను ప్రస్తుతం సాగు చేసేందుకు విత్తనాలు సమీకరిస్తున్నారు. ఇక బొరుగులు, అటుకుల తయారీకి ఎంపిక చేసిన ఎంటీయూ- 1010 రకాన్ని రెండో, మూడో ప్రాధాన్యత క్రమంలో సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎడగారులో ఇప్పటి వరకు ఎప్పుడు లేని విధంగా పూర్తి విస్తీర్ణంలో వరిని సాగు చేసేందుకు రూరల్ మండలంలోని రైతులు సిద్ధమవుతున్నారు. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించకుండా వరినే సాగు చేయడం గమనార్హం.

నీటి లభ్యత ఉంటేనే సాగుచేయండి



ఎడగారులో వరి సాగు చేసే రైతులు స్థానికంగా నీటి లభ్యత చూసుకోవాలి. కేఎన్ ఎం వంగడాలు ఎడగారులో సాగు చేయవచ్చు. వాటినే రైతులు కూడా ఎక్కువగా అడుగుతున్నారు. కానీ ఈ సీజన్‌లో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే ఆశించిన దిగుబడులు వస్తాయి.

- ఎస్వీ నాగమోహన్, ఏవో

'పది' విద్యార్థులకు 11న అవార్డులు

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరపాలక ఉన్నత పాఠశాలల్లో చదివి పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కఠారి తిరుపాలు ఎస్ఎస్‌సీ టాపర్స్ అవార్డులు అందచేస్తున్నట్లు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఐఎంఏ హాలులో ఈనెల 11వతేదీ ఉదయం పది గంటలకు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు-డాక్టర్ సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, అవార్డులు అందచేస్తామని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలుగా అందచేస్తున్న ఈ అవార్డులకు టెన్త్‌లో 570 మార్కులు ఆపైన సాధించిన విద్యార్థులందరూ అర్హులేనని తెలిపారు. మార్కుల జాబితా, ఆధార్ కార్డుతో శుక్రవారంలోపు పొగతోటలోని సమతా నర్సింగ్ హోమ్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



మూలస్థానేశ్వరుడికి త్రిపురాసుర వధ అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వరాల యంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో బుధవారం ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకారం జరిగింది. రాత్రి స్వామి వారికి త్రిపురాసుర వధ అలంకారంలో స్వామివారి వనంలో పూజలు చేశారు. ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ఆదిశంకరుల స్మరణోత్సవాలు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పొగతోటలో ఉన్న ఆదిశంకర ధ్యాన మందిరంలో ఆదిశంకరా చార్య స్మరణోత్సవాలు బుధవారం ప్రారంభ మయ్యాయి. శృంగేరి విరూపాక్ష పీఠం 46వ పీఠాధిపతి గంబీరానంద భారతీస్వామి ప్రారంభించారు. విశేష పూజల అనంతరం స్వామివారు ప్రవచనం చేశారు. సాయంత్రం సురభి గాయత్రి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ధ్యాన మందిరం సభ్యులు, చక్రాలవారి ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. ధ్యాన మందిరం మేనేజర్ స్వామి సమయానంద పర్యవేక్షించారు.

భగవద్రామానుజులకు చందనాలంకారం

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి ఆల యంలో బుధవారం సాయంత్రం భగవద్రామానుజాచార్యులకు చందనాలంకారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భం గా రంగనాథ స్వామికి, రంగనాయకమ్మకు ఆండాళ్ సన్నిధిలో విశేష పూజలు జరిగాయి. ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



విశ్వనాథుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి బ్రహ్మోత్స వాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం, మృత్స గ్రహణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ చేశారు. ఆలయ ఈవో దర్గయ్య, భక్తులు పాల్గొన్నారు.

విశ్వకవి రవీంద్రుడికి నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన తరగతుల్లో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి నిర్వహిం చారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా, మోటివేటర్లు, విద్యార్థులు విశ్వకవికి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. తెలుగు క్విజ్, యోగా కార్యక్రమాలు జరిపారు. క్విజ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్, సిబ్బంది జితేంద్ర, కృష్ణయ్య, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి శిక్షణా శిబిరాలకు హాజరైన క్రీడాకారులకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు, దాతల సహకారంతో క్రమం తప్పకుండా ప్రతి ఏడాది ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతలు సోంపల్లి రఘురామయ్య నాయుడు, కూచి గోవిందయ్య, అసోసియేషన్ అధ్యక్షుడు పోబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహ సురేష్, కోశాధికారి వింజం రామానాయుడు, మాజీ అధ్యక్షులు వేలూరు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల ప్రొవిజన్లకు సెంట్రలైజ్డ్ టెండర్లు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంఘిక, గిరిజన, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, జువైనల్, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు, హాస్టళ్ల విద్యార్థులకు అవసరమైన ప్రొవిజన్లు, నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం టెండర్ల కమిటీ/ టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీలను సవరిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో జిల్లా కమిటీల ద్వారా ప్రొవిజన్లు కొనుగోలు చేసేవారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకే గతంలో ఉన్న టెండర్లు ఎవాల్యుయేషన్ కమిటీని మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్/గురుకుల సొసైటీ సెక్రటరీ ఛైర్మన్‌గాను, సంక్షేమ శాఖల డైరక్టర్లు, గురుకుల సొసైటీలు, కేజీబీవీల కార్యదర్శులు, పరిశ్రమలశాఖ, సాంకేతిక శాఖ నియమించిన సాంకేతిక నిపుణులు సభ్యులుగాను, జేడీ/డీడీ/జాయింట్ సెక్రటరీ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మంగారి ఆరాధన



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవంలో భక్తులు

నెల్లూరు (సాంస్కృ తికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని విరాట్‌నగర్‌లో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం 332వ వార్షిక ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, చంద నాలంకారం, గణపతిపూజ, పుణ్యాహ వచనం, బ్రహ్మ కలిశ సకల దేవతల ఆహ్వానం జరిగాయి. అనంతరం స్వామి వారికి సమాధి పూజ, మూర్తి హోమం, సహస్ర నామార్చన నిర్వహించారు. ఆ తర్వాత అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సహస్ర దీపారాధన, కోలాటం, భరతనాట్య ప్రదర్శన జరిగాయి. కార్యక్రమాలను విశ్వబ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షుడు కందు కూరు చెంగయ్య ఆచారి, ఉపాధ్యక్షుడు కందుకూరి జనార్దన్, ప్రధాన కార్యదర్శి విగ్రహాల బాల కృష్ణ ఆచారి, కార్యనిర్వాహక అధ్యక్షుడు అలిమేలి శ్రీహరి ఆచారి, కోశాధికారి దండుపాణి సురేష్ ఆచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బల్లవోలు రమణయ్య తదితరులు పర్యవేక్షించారు.

● భక్తవత్సలనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో 332వ ఆరాధనోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం విశేష పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శివకుమార్, వి.సుధాకర్, ఎం శ్రీనివాసులు, వెంగయ్యఆచారి, మునుస్వామిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం), మే 7 (ఆంధ్రజ్యోతి) : జై వాసవీ.. జైజై వాసవీ అంటూ భక్తుల నామస్మరణ మధ్య వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం వైభవంగా సాగింది. నగరంలోని స్టోన్‌హౌస్ పేటలో ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, సాయంత్రం విశేష పూలంగిసేవ చేశారు. అమ్మవారు బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పులివాహనంపై వాసవీ దేవికి నగరోత్సవం జరిగింది. విశేష పుష్పాలంకరణ, విద్యుద్దీపాలు, బాణాసంచా వేడుకలు మంగళవాయిద్యాలు, తెనాలి బ్యాండ్, కడప తీన్‌మార్‌తో ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని హారతులిచ్చారు. ఆలయం నుంచి నవాబుపేట సెంటర్, శెట్టిగుంట రోడ్డు, పప్పులవీధి, స్టోన్‌హౌస్‌పేట మీదుగా ఆలయం వరకు ఉత్సవం సాగింది. ఈ ఉత్సవాన్ని దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, కిషోర్, హజరత్‌బాబు, మురళీ, జయ ప్రకాష్, ఎంపీ అంజనేయులు పర్యవేక్షించారు.

కాలువలపై ర్యాంపులు, మెట్లు తొలగిస్తాం

● నగర కమిషనర్ నందన్



డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు సిటీ, మే 7,(ఆంధ్రజ్యోతి) : కాలువల్లో వ్యర్థాల తొలగింపునకు, మురుగునీటి ప్రవాహానికి ఆటకంగా మారిన ర్యాంపులు, మెట్లను తొలగిస్తామని కార్పొరేషన్ కమిషనర్ నందన్ స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని 7వ డివిజన్ చాకలివీధి, శెట్టిగుంటరోడ్డు, లక్ష్మీపురం, గమళ్లవీధి, నవాబుపేట ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అక్కడి కాలువల్లో పూడికతీతకు ఇబ్బందిగా మారిన నిర్మాణాలను పరిశీలించారు. రోడ్లపై ఎవరూ చెత్త వేయొద్దని, మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. అనంతరం కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల శానిటేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ 14 రోజులకు ఒకసారి దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. కాగా, 4,17 డివిజన్లలో ఎంహెచ్‌వో చైతన్య పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

జాతీయ ఇంగ్లిష్ వర్డ్‌లో జిల్లా విద్యార్థి ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఎస్‌పీడీ శ్రీనివాసరావు

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎస్ వండ్లూరు ఎంపీపీ పాఠశాల విద్యార్థి పీ చరణ్ శ్రీనివాస్ జాతీయ ఇంగ్లిష్ వర్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రానికి ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించిందని సమగ్రశిక్ష ఎస్‌పీడీ బీ శ్రీనివాసరావు అభినందించారు. విజయవాడలోని ఎస్ఎస్ఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మొత్తం నలుగురు విద్యార్థులు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించి ఓవరాల్ చాంపియన్ సాధించారని చెప్పారు. దీనిలో కీలకంగా వ్యవహరించిన జిల్లా విద్యార్థితోపాటు ఉపాధ్యాయురాలు కే శిరీషను ఎస్‌పీడీ ప్రత్యేకంగా అభినందించి విద్యలో మరింత ఉత్తమంగా రాణించేలా సాధన చేయాలని సూచించారు. జిల్లా ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలకు గత నెల 21 నుంచి 25వతేదీ వరకు జరిగిన పోటీల్లో జిల్లా విద్యార్థి ప్రతిభ చూపారని తెలిపారు. విద్యార్థి చరణ్‌తోపాటు ఉపాధ్యాయిని శిరీషను డీఈవో బాలాజీరావు, సమగ్రశిక్ష సిబ్బంది, ఉపాధ్యాయులు అభినందించారు.



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి ఆనం, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నిధులు రాబట్టడంలో శ్రీధర్‌రెడ్డి దిట్ట

● రూ. 2.67 కోట్ల రోడ్డు శంకుస్థాపనలో మంత్రి ఆనం

నెల్లూరురూరల్, మే 7(ఆంధ్రజ్యోతి) : తన నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు నిధులు తీసుకురావడంలో రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి దిట్ట అని, ఈ నియోజకవర్గంలో మూడు పర్యాయాలు వరుసగా ఎమ్మెల్యేగా గెలవడమూ సామాన్యమైన విషయం కాదని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం రూ.2.67 కోట్లతో నగరంలోని గాంధీనగర్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నెల్లూరు నగరం, రూరల్ రాజకీయంగా అత్యంత సున్నితమైన ప్రాంతాలన్నారు. ఇక్కడ సుదీర్ఘ రాజకీయం చేయడం, మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం మామూలు సంగతి కాదన్నారు. రెండు దశాబ్దాల క్రితం ఈ ప్రాంతమంతా రాపూరు నియోజకవర్గంలో ఉన్నప్పుడు ఇక్కడకు వచ్చానని, మళ్లీ ఇప్పుడ వచ్చినట్లు గుర్తుచేసుకున్నారు. 339 అభివృద్ధి పనులను 60 రోజుల్లో పూర్తి చేయడమనేది అన్నీచోట్ల సాధ్యం కాదని, కానీ రూరల్ ఎమ్మెల్యే సుసాధ్యం చేసి చూపారని ప్రశంసించారు. గత ప్రభుత్వంలో ఏ ఎమ్మెల్యే కూడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఆనం రంగమయూర్‌రెడ్డి, చెక్కా సాయి సునీల్, గిరినాయుడు పాల్గొన్నారు.

కోటంరెడ్డికి మాజీ ఉపరాష్ట్రపతి ప్రశంస

నెల్లూరు రూరల్, మే 7,(ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో కేవలం 60 రోజుల్లో 339 అభివృద్ధి పనులను రూ. 41.32 కోట్లతో పూర్తి చేయడం వెనుక మీ కార్యదక్షత, నిబద్ధత స్పష్టంగా కనిపిస్తున్నాయంటూ భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు రూరల్ శాసన సభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ప్రశంసిస్తూ బుధవారం లేఖ రాశారు. ఈ పనులన్నింటినీ ప్రజలతో ఒకే రోజులో శంకుస్థాపనలు చేయించి, అనుకున్న వ్యవధిలో పూర్తి చేసి వాటన్నింటికీ ఒకే రోజు ప్రారంభోత్సవాలు పెట్టడం అభినందనీయమని ఆ లేఖలో పేర్కొన్నారు. అభివృద్ధి పనులు చేపట్టడమేకాక వాటిపై ఫొటలతో పుస్తకాన్ని తీసుకురావడం మంచి ప్రయత్నమని, పాలనలో పుస్తకాలు పారదర్శకతకు చిహ్నాలన్నారు. అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ప్రశంసనీయమని తెలిపారు. మిత్రుల ద్వారా అభివృద్ధి సంగతులు తెలుసుకుని ఉత్తరం రాస్తున్నానని వివరించారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని వెంకయ్య ఆకాంక్షించారు.

రేపు ఏపీటీఎఫ్ ధర్నా

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విద్యారంగ సమస్యలపై శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు దశర థరాములు, హజరత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పలురూపాల్లో నిర్వహించిన నిరసనలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తున్నామని తెలిపారు.

ఫుట్‌బాల్ క్రీడతో ఉజ్వల భవిషత్

● డీఎస్‌డీవో యతిరాజ్



విజేతకు ట్రోఫీ అందిస్తున్న డీఎస్‌డీవో తదితరులు

నెల్లూరు(విద్య), మే 7 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌బాల్ క్రీడలో యువత రాణిస్తే ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకుని ఉజ్వల భవిషత్‌కు బాటలు వేసుకోవచ్చని డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆదేశాల మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి అస్మితా సిటీ లీగ్ మహిళా ఫుట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ శాప్ ద్వారా దేశంలోని మహిళా క్రీడాకారిణులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. దీనిలో భాగంగా నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ఏడు జట్లు పాల్గొని ప్రతిభ చూపాయన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం ఫుట్‌బాల్ క్లబ్ ప్రథమ స్థానం, నెల్లూరు ఫుట్‌బాల్ క్లబ్ ద్వితీయ స్థానం, సింహపురి ఫుట్‌బాల్ క్లబ్ తృతీయ స్థానం సాధించాయన్నారు. విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, షీల్డులు అందచేశారు. ఈ ఏడాది సీనియర్ జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎస్‌కే రషీద, సీహెచ్ హారిక, ఎం నాగమణి, జూనియర్ జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఏ వనజను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి పీ ఉమాశంకర్, సభ్యులు, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళి



జడ్పీలో అల్లూరికి నివాళి అర్పిస్తున్న అరుణమ్మ, అధికారులు

నెల్లూరు (జడ్పీ), మే 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. జడ్పీ ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నెల్లూరు(క్రైం,ఆంధ్రజ్యోతి) : అల్లూరికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జీ కృష్ణకాంత్ నివాళి అర్పించారు. మన్యం ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన ధీరుడని కొనియాడారు.

నెల్లూరు(విద్య,ఆంధ్రజ్యోతి) : అల్లూరి జీవితం ఆదర్శప్రాయమంటూ డీఈవో బాలాజీరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సీతారామ రాజు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ప్రకటన

నెల్లూరు నగరం, గోమతి నగర్ కాపురస్తులు అయిన **చింతపల్లి వెంకటరామిరెడ్డి** గారి కుమారుడు **చింతపల్లి శ్రీధర్ రెడ్డి** మరియు వారి భార్య **ఉమా ప్రసన్న** గార్ల సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయుట ఏమనగా సదరు **శ్రీధర్ రెడ్డి, ఉమా ప్రసన్న** గార్ల ఆస్తి తాలూకా లింకు దస్తావేజులు అయిన డాక్యుమెంటు నెం: 906/2012 మరియు 1585/1998 ద్వారా రిజిష్టర్లు కాబడిన రెండు ఒరిజినల్ విక్రయ పత్రములను తీసుకొని తే **20-01-2025** దిన ఉదయం **11:00** గంటలకు వారు తమ ఇంటి నుండి బయలుదేరి వేదాయపాలెంలోని లాయరుగారి ఇంటికి వెళ్ళి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో ఒరిజినల్ దస్తావేజులను పోగొట్టుకున్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవ్వరికైన దొరికినచో దిగువ కనబరిచిన చిరునామాకు తెచ్చి ఇవ్వగలరు. సదరు దస్తావేజు తెచ్చి ఇచ్చిన వారికి తగు బహుమానము ఇవ్వబడును.

Counter Signed by
రాపూరు రమేష్ బాబు B.Com., LLM.,
అడ్వొకేట్, రామలింగాపురం
నెల్లూరు. సెల్ : 93930 44455


ఇట్లు,
1. శ్రీధర్ రెడ్డి
2. ఉమా ప్రసన్న

SRI CITY
An Integrated Business City

స్వాగతం - సుస్వాగతం


శ్రీసిటీలో ఎల్ జి ఎలక్ట్రానిక్స్
భూమిపూజ కార్యక్రమానికి విచ్చేయనున్న
ముఖ్య అతిధులకు
మా హృదయపూర్వక స్వాగత సుమాంజలులు

LG Electronics



శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు

తేదీ : 08-05-2025 (గురువారం)
పరిశ్రమ పెట్టుబడి
5,001 కోట్లు | ఉద్యోగాలు : 6000+



శ్రీ నారా లోకేష్ గారు
మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖామాత్యులు



శ్రీ లీ సియోంగ్-హో గారు
భారత్ లోని కొరియా రిపబ్లిక్ రాయబారి



శ్రీ జేచియోల్ లియు గారు
CEO, హెూమ్ సొల్యూషన్,
LG ఎలక్ట్రానిక్స్ ఇంక్., కొరియా)



శ్రీ జే సంగ్ లీ గారు
CEO. ఎకో సొల్యూషన్,
LG ఎలక్ట్రానిక్స్ ఇంక్., కొరియా

31 దేశాలకు చెందిన 235 పరిశ్రమలతో 65 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు (అందులో 50 శాతం మహిళలు) కల్పిస్తున్న శ్రీసిటీలో ప్రముఖ సంస్థ ఎల్ జి కెమ్ తో పాటు మరో 8 కొరియన్ కంపెనీలు కొలువుతీరడం గర్వకారణం

LG Electronics
LG Chem — LG Polymers India Pvt. Ltd.
HDC HYUNDAI EP
SOLUM — Solution provider.
HAENG SUNG
SK pucore
Corea IND. — COREA INDUSTRIAL., Ltd.
TAESUNG ELECTRONICS
KSP — KYUNGSUNG PRECISION

Sri City – A Global Manufacturing Hub, Where Vision Meets Reality!

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

అప్రమత్తంగా ఉండండి

- ప్రజలకు అవగాహన కల్పించండి
- 'ఆపరేషన్ సిందూర్' అనంతర పరిస్థితులపై సీఎం ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' అనంతర పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగాన్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం వర్చువల్ విధానంలో అధికారులతో సీఎం సమీక్షించారు. జిల్లాలో పౌర రక్షణపై అవగాహన కల్పిస్తూ మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. రెవెన్యూ, పోలీసు, ఫైర్, మెడికల్ తదితర ఎమర్జెన్సీ సర్వీసులు, ఇతర అధికారులు భాగస్వామ్యం కావాలన్నారు. జీజీహెచ్, ఏరియా, జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లతో సమన్వయం చేసుకుని అన్ని రకాల అత్యవసర చికిత్సలు, మందులు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పరిశ్రమల్లోనూ ముందస్తు చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తప్పుడు ప్రచారం ప్రజల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


సీఎం వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, అధికారులు



మేమంతా మీ వెంటే...

పాకిస్థాన్‌లో ఉగ్రమూకలపై సాహసోపేతంగా విరుచుకుపడిన భారత సైన్యానికి వివేకానంద కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు మల్లికార్జున్ సారథ్యంలో విద్యార్థులు జేజేలు పలికారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జాతీయ జెండాలు చేతబూని జైభారత్ అంటూ వారు నినదించారు. - గూడూరు, ఆంధ్రజ్యోతి



విజయాన్ని ప్రసాదించు స్వామీ

పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను మట్టుబెడుతున్న భారత సైన్యానికి విజయం ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక పెద్దకాపు లేఔట్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. బీజేపీ నాయకులు వరప్రసాద్, నవీన్‌కుమార్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు. - తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆంధ్రజ్యోతి






భైరాగి వేషంలో కైకాల వంశస్థుడు


జాతర వేషాల పిల్లలతో ఎమ్మెల్యే


డిప్యూటీ మేయర్ ఆర్సీ మొక్కులు



భైరాగులం.. మేము భైరాగులం



గంగజాతరలో మొదలైన వేషాల సందడి

శరీరమంతా నామం కొమ్ము పూసుకున్నారు. రేళ్ల కాయలు, మల్లెపూల మాలలు ధరించారు. ఇలా.. బైరాగి వేషంలో సందడి చేశారు. తిరుపతి గంగజాతరలో తిరుపతి గంగజాతర వేషాలలో మొదటిరోజైన బుధవారం భక్తులు బైరాగివేషంలో గంగమ్మను దర్శించుకున్నారు. ముందుగా వేశాలమ్మ, తాళ్లపాక పెద గంగమ్మలను దర్శించుకున్న అనంతరం తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వచ్చి భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. బైరాగి వేషంలో భక్తులు ఇంటి నుంచి బూతులు తిడుతూ, చిందులేస్తూ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి విశ్వరూపం ముందున్న ఉప్పుపీఠాన్ని కర్రలతో కొడుతూ ప్రణమిల్లారు. ఇక, తాతయ్యగుంట గంగమ్మ సోదరిలుగా పూజలందుకుంటున్న వేశాలమ్మ, తాళ్లపాక పెద గంగమ్మ, అంకాళమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, నేరెళ్లమ్మ ఆలయాల్లోనూ జాతర సందడి కనిపించింది.

- తిరుపతి/తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

నేడు బండవేషం

గురువారం భక్తులు శరీరమంతా రక్తం చిందినట్టు కుంకుమ రాసుకుని కాటుకబొట్లు, తెల్లటి పూలు చుట్టుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. వయో పరిమితిలేకుండా బండవేషాన్ని భక్తులు వేస్తారు.






సూళ్లూరుపేట వద్ద నిమ్మకాయల దండతో టీడీపీ శ్రేణుల స్వాగతం - లోకేశ్‌ను పలకరిస్తున్న టీడీపీ నేత గంగాప్రసాద్

పనిచేసే వారిని ప్రోత్సహిస్తా


సత్యవేడు సభలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

- జూనియర్లనూ గౌరవిస్తా
- కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోం
- సత్యవేడు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేశ్

సత్యవేడు, మే 7 (ఆంధ్రజ్యోతి): 'యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీకి కట్టుబడి పార్టీలో పనిచేసే వారిని ప్రోత్సహిస్తా. సీనియర్లతో సమానంగా జూనియర్లనూ గౌరవిస్తా' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. సత్యవేడులో బుధవారం రాత్రి ఆయన నియోజకవర్గ టీడీపీ ఉత్తమ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎప్పుడు ఈ ప్రాంతానికి వచ్చినా ముందుగా కార్యకర్తలనే కలస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఈ సమావేశానికి వచ్చానన్నారు. నాయకుల చుట్టూ కాదు.. ప్రజల చుట్టూ తిరగాలని కార్యకర్తలకు సూచించారు. టీడీపీలో క్యాడర్‌కు అలకలు అనే జబ్బు ఉందన్నారు. పార్టీలో సమస్యలుంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. నిర్ణయాలు తీసుకునే క్రమంలో కొన్నిసార్లు సమయం పడుతుందన్నారు. అయితే కార్యకర్తల మనోభీష్టానికి వ్యతిరేకంగా ఏ నిర్ణయమూ తీసుకోమని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ తీసుకున్న నిర్ణయాలను అందరం గౌరవించి అమలు చేయాల్సిందేనని లోకేశ్ స్పష్టం చేశారు. ఇక మీదట పార్టీలో పదవులు, ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులూ కావాలంటే తప్పనిసరిగా కుటుంబ సాధికార వారధులుగా పనిచేయాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే నేతలకే పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన నిమ్మకాయల చిన రాజప్పను గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా చేశామని, స్కూలు టీచర్ అనిత ను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఇప్పుడు హోమ్ మంత్రిగా నియమించామని గుర్తు చేశారు. కలిశెట్టి అప్పలనాయుడు సామాన్య కార్యకర్త నుంచీ, కాల్వ శ్రీనివాసులు సాధారణ జర్నలిస్టు నుంచీ వచ్చిన వారేనన్నారు. అందుకే ఉత్తమ కార్యకర్తలను గుర్తించి అవార్డులు ఇస్తున్నామన్నారు. కమిటీలను పకడ్బందీగా నియమించుకుని ముందుకు వెళదామన్నారు. తమ క్లస్టర్, యూనిట్, బూత్‌లపై మాత్రమే కార్యకర్తలు దృష్టి పెట్టాలని, ఇతరులను పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ నెల 14న జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో కార్యకర్తల సమస్యలను చర్చిస్తామన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందే

పార్టీ అధ్యక్షుడి నుంచి కుటుంబ సాధికార సారథి వరకూ అందరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని మంత్రి లోకేశ్ స్పష్టంచేశారు. అహంభావాన్ని ప్రజలు తిరస్కరిస్తారంటూ.. వైసీపీ 151 నుంచీ 11 స్థానాలకు పడిపోయిందని గుర్తుచేశారు. వైసీపీ నాయకుల తీరు ఇప్పటికీ మారలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సీడాప్ ఛైర్మన్ దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతి బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోట మాజీ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లప్పరెడ్డి వినోద్‌రెడ్డి లోకేశ్‌ను కలిసి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈయన వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే నల్లప్పరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మనవడు.



ఎమ్మెల్యే ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి!

- అనుచరుల ధర్నా, ర్యాలీ

మంత్రి నారా లోకేశ్ పర్యటన సందర్భంగా.. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ ఆయన అనుచరులు ధర్నాకు దిగారు. లోకేశ్ సత్యవేడు చేరుకోక ముందే సుమారు వంద మంది ప్లకార్డులతో ధర్నా చేశారు. ఎమ్మెల్యేపై కేసు పరిష్కారమైనప్పటికీ సస్పెన్షన్ ఎత్తివేయకపోవడం అన్యాయమన్నారు. నియోజకవర్గంలో బయటి వారి పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. గ్రావెల్ వ్యాపారాలకు అడ్డు వస్తున్నారని దళిత ఎమ్మెల్యేని అణగదొక్కేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వీరు మంత్రి లోకేశ్‌ను కలిసేందుకు పోలీసులు అనుమతించలేదు.

ప్రతిభకు ప్రశంసలు

- రాష్ట్రస్థాయిలో అవార్డులకు ఎంపికైన విద్యార్థులు వీరే

చిత్తూరు సెంట్రల్, మే 7(ఆంధ్రజ్యోతి): టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో టాప్ టెన్‌లో నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులను అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆశ్రమ, సాంఘిక, సంక్షేమ, హాస్టళ్లలో వుంటూ టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల, బెస్టు సబ్జెక్టు టీచర్ల, వార్డెన్ల, ప్రిన్సిపాళ్ల జాబితాను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. వీరిని ప్రభుత్వం సన్మానించనుంది.

పదో తరగతి: వసతిగృహాల విద్యార్థులు.. టి.విశ్వనాథ్ (తిరుపతి) 600 మార్కులకు గాను 586 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచాడు. బి.హనుమంతు(వెంకటగిరి) 580 మార్కులు సాధించి ఏడవ స్థానంలో నిలిచాడు. పి.భావన(తిరుపతి) 577 మార్కులతో పదవ స్థానంలో నిలిచింది. కె.మహాలక్ష్మి(రాయలపేట, చిత్తూరు) 578 మార్కులతో తొమ్మిదవ స్థానంలో నిలిచింది. ఎ.శ్రీధర్(టి.సుండుపల్లి,అన్నమయ్య జిల్లా) 577 మార్కులతో పదవ స్థానంలో నిలిచాడు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో టెన్త్ టాపర్లుగా శ్రీకాళహస్తి నుంచి ఎం.కీర్తనాభాయ్ 583మార్కులతో తొమ్మిదవ స్థానంలో, వెంకటగిరి నుంచి బి.లహరి 578 మార్కులతో పదవ స్థానంలో నిలిచింది.

ఇంటర్మీడియట్: వాకాడుకు చెందిన టి.ప్రభు ఎంఈసీ గ్రూపులో 922 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. పలమనేరుకు చెందిన ఎం.వైష్ణవి 918 మార్కులతో మూడవ.. పుత్తూరులోని పి.శిరీష హెచ్‌ఈసీ గ్రూపులో 927 మార్కులతో రెండవ.. పీలేరుకు చెందిన జీకే హాసిని హెచ్‌ఈసీలో 913 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు.

- సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థినుల్లో చిత్తూరు జిల్లా పూతలపట్టులోని ఎం.జోత్స్న బైపీసీలో 964 మార్కులతో రెండవ స్థానంలో.. పలమనేరులోని టి.హర్షిత ఒకేషనల్ విభాగంలో 971 మార్కులతో రెండవ స్థానంలో నిలిచారు. అన్నమయ్య జిల్లాలోని జీఎస్‌డబ్ల్యుసీజీహెచ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలోని సి.పల్లవి ఒకేషనల్ విభాగంలో 981 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. రాయచోటిలో ఎం.వెంకటేష్ ఒకేషనల్ (సెరికల్చర్)లో 971 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో శ్రీకాళహస్తి ఎస్‌ఓఈ కళాశాలలోని ఎం.భావణిబాయ్ బైపీసీలో 982 మార్కులు సాధించి ఐదవ స్థానంలో నిలవగా, శ్రీకాళహస్తి యూఆర్‌జేసీ (జీ)లోని వి.అనూష సీఈసీ గ్రూపులో 931 మార్కులు సాధించి తొమ్మిది, వి.స్నేహలత 928 మార్కులు సాధించి పదవ స్థానంలో నిలిచారు. హెచ్‌ఈసీ గ్రూపులో తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు ఆర్‌జేసీ (బాయ్స్) బి.లక్ష్మీనరసింహ 930 మార్కులు సాధించి పదవ స్థానంలో నిలిచాడు.

స్టేట్ మెరిటోరియస్ సబ్జెక్టు టీచర్ అవార్డులు

సత్యవేడులోని ఎం.వసుంధరదేవి (మ్యాథ్స్), జి.అనురాధ (బోటనీ), అన్నమయ్య జిల్లా బురకాయలకోట ఎస్.సుమియ (సివిక్స్), బి.కొత్తకోట ఇ.విజయకుమార్ (కామర్స్).

బెస్టు హాస్టల్ వార్డెన్ అవార్డులు : మదనపల్లె నూలివేడు జీఎస్‌డబ్ల్యుబీహెచ్, తిరుపతి జిల్లా నాయుడుపేట ఎస్‌డబ్ల్యుజీహెచ్ నెం.2.

బెస్టు ప్రిన్సిపాల్ అవార్డు

చిత్తూరు జిల్లా పూతలపట్టులోని ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈలోని ఎస్.కోటేశ్వరరావు ఎంపికయ్యారు. ఏపీ ట్రైబుల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో బెస్టు నోడల్ ప్రిన్సిపాల్‌గా శ్రీకాళహస్తి ఏపీటీడబ్ల్యుయూఆర్‌జేసీ (జీ)లోని వై.దామోదర నాయుడు ఎంపికయ్యారు.

విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు

- ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): విద్వేషాలు రెచ్చగొట్టేలా ఎవరైనా మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో విద్వేషపూరితమైన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా షేర్ చేస్తే చర్యలు తప్పవన్నారు. పోస్టు చేసిన ఆడియో, వీడియోలు మెసేజ్‌ల రూపంలో గ్రూపుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉంటే కేసులు నమోదు చేస్తామన్నారు. దీనికి ఆయా గ్రూపుల అడ్మిన్‌లదే బాధ్యత అన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నేలపట్టులో అభివృద్ధి పనులపై సమీక్ష



సమావేశమైన అధికారులు

దొరవారిసత్రం, మే 7(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల కేంద్రంలో పర్యాటకులకు అనువైన వసతుల కల్పనలో భాగంగా చేపట్టాల్సిన మరిన్ని అభివృద్ధి పనులపై రేంజర్ సౌజన్య ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. పేదలకు ఉపాధి కల్పనతో పాటు నేలపట్టులో ల్యాండ్ స్కేప్ పనులు, పరిసర ప్రాంత రైతులకు ఉపయోగ పడేలా పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, డాక్టర్ జశ్వంత్, నేలపట్టు ఎఫ్ఎస్‌వో బాలయ్య, వెలుగు ఏపీఎం మునిరాజయ్య, ఉపాధి ఏపీవో ఉషారాణి, వ్యవసాయశాఖ ఎంపీఈవో గ్రేస్‌జోసప్, ఫిషరీస్ అసిస్టెంట్ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన



పోటీల్లో గెలుపొందిన లేగదూడలు, బహుమతులతో యజమానులు

కోట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం లేగదూడల ప్రదర్శన జరిగింది. నెల్లూరు జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యనిర్వాహణాధికారి డాక్టర్ శ్రీనివాసులు, కోట ప్రాంతీయ వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యంరెడ్డి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఊను గుంటపాళెం, రుద్రవరం, చిట్టేడు, మద్దాలి పంచాయతీల రైతులు లేగదూడ లను ప్రదర్శించారు. మొత్తం 46 లేగదూడలను ప్రదర్శించగా, మూడింటికి బహుమతులు ప్రదానం చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విద్యారమ

వాకాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని నెల్లూరు జడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. బుధవారం ఆమె వాకాడుమండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మొదటగా ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో జరుగు తున్న పలు అభివృద్ధి పనులు, సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలు తదితర అంశాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, మే 7 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డులో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ కమిటీ నిర్వాహకుడు చిట్టే టి పెరుమాల్ దంపతుల చేతుల మీదుగా గోపూజ నిర్వహించారు. అనం తరం హోమం, అభిషేకం చేశారు. స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, నాపా మునిరాజా స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో చిట్టేటి పెరుమాల్, నూలేటి రమణయ్య, చెంగయ్య, బట్టా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహానాడు లోగా పార్టీ కమిటీలను పూర్తి చేయాలి



సమావేశమైన టీడీపీ నాయకులు

డక్కిలి, మే 7(ఆంధ్రజ్యోతి): మహానాడులోగా మండల, గ్రామ కమిటీలు, బూత్ స్థాయి కన్వీనర్ల నియామకాన్ని పూర్తి చేయాలని టీడీపీ మండల అ ధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యా యలంలో మండల, గ్రామస్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించారు. మం డల, గ్రామస్థాయి కమిటీలను త్వరగా నియమించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల దిశానిర్దేశం చేశారని చెప్పారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

పురపాలక సంఘ కార్యాలయము, గూడూరు

ఇ-ప్రోక్యూర్ టెండర్ ప్రకటన

టెండర్ నోటీసు: Roc.No.437/2025/E1 తేది:08-05-2025
IFB.No.1/E1/2025

గూడూరు పురపాలక సంఘం (తిరుపతి జిల్లా) పరిధిలో సాధారణ నిధులతో 1 పనికి రూ.70.00 లక్షలతో Providing central lighting from Vinayaka Swamy Temple Near RTC Bus Stand to Royal Enfield showroom in Gudur Municipality పనికి సంబంధించి పిలుపు తేది.08.05.2025 ఉదయం. 10.30 గం. నుండి షెడ్యూలు ప్రారంభము మరియు బిడ్ స్వీకరించుటకు చివరి తేది:26.05.2025 ఉదయం. 11.00 గం. వరకు, మిగతా వివరములకు ఇ-ప్రోక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వివరాలకు www.apeprocurement.gov.in వెబ్ సైట్‌లో చూడగలరు.
ఫోన్ నెం.9849908254

కమీషనర్
గూడూరు పురపాలక సంఘం

15న జాబ్‌మేళా

వెంక టగిరి, మే7:(ఆంధ్రజ్యోతి) స్థానిక విశోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధిం చిన పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆవిష్క రించారు. నిరుద్యోగ యువత కోసం శ్రీసిటీ, మేనకూరు సెజ్, తిరు పతిలోని ఈఎంసీ క్లస్టర్, చెన్నైలోని 18 బహుళజాతీ కంపెనీలు 800 పైగా ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాబ్‌మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు 7013509543, 9491458910, 9988853335 నంబర్లకు సంప్రదించా లని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం కోరారు.

నేడు గోవిందపల్లిలో మాక్‌డ్రిల్

గూడూరు, మే 7(ఆంధ్రజ్యోతి): తుపాను, వరదల సమయంలో తీరప్రాంతాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో గురువారం కోట మండలం గోవింద పల్లిలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తుపాన్లు, వరదల సమయంలో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోండి

దొరవారిసత్రం, మే 7(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్‌తో పాటు, అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోతిర్మయి కోరారు. రైతు సేవా కేంద్రాల్లో, వ్యవసాయశాఖ సహాయకుల వద్దకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు అందజేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అక్రమణలను అడ్డుకోండి

గూడూరు అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రభుత్వ స్థలాల్లో అక్రమణలను అధికారులు అడ్డుకోవాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికుమార్ అన్నారు. బుధవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ అరుంధ తీయపాళెంకు చెందిన గురవమ్మ ఇంటి స్థలాన్ని కొందరు ఆక్రమిస్తుం డడంతో అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఉన్నతాధి కారులు స్పందించి పేదలకు న్యాయం చేయాలని కోరారు.





సప్పరంపై పోలేరమ్మ ఊరేగింపు - అమ్మవారికి సారె అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

నాయుడుపేట/టౌన్, మే 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతర వేడుకగా జరిగింది. సంప్రదాయం ప్రకారం అమ్మవారి పుట్టినిల్లు అయిన పడమటి వీధి బోయపాళెంలోని కుమ్మరిమిట్టలో పోలేరమ్మ విగ్రహాన్ని తయారు చేశారు. మంగళవారం రాత్రి బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, భక్తుల నృత్యా లతో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున శెట్టిపల్లివారి వీధిలోని అత్తవారి ఇల్లు అయిన అలంకరణ గుడికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చలువ పందిరిలో పోలేరమ్మను కొలువుతీర్చారు. అక్కడ భక్తిరస గ్రామదేవతల పాటలతో సందడి నెలకొంది. అమ్మవారి ఎదుట భక్తులు కుంభాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన వెంటనే కోర్కెలు తీర్చే పోలేరమ్మకు భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు చావిడిచుట్టూ వేయికళ్ల కుండలు నెత్తిపై పెట్టు కుని భక్తిశ్రద్ధలతో గుడి వద్ద ప్రదక్షణలు చేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు వేయికళ్ల కుండలను నెత్తిన పెట్టుకుని భక్తి పారవశ్యంతో అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పోలే రమ్మకు సారె అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసారత్నం, జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మీనాక్షి సుందరి పోలేరమ్మను దర్శించు కున్నారు. జాతర కార్యక్రమాల్లో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, జాతర కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, ఈవో రవికృష్ణ, నాయ కులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, మధు సూదన్‌రెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, కలికి మాధవరెడ్డి, శ్రీరామ్‌ప్రసాద్, మైలారి శోభారాణి, మైలారి రాజశేఖర్, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నారాయణ, రవి, చేవూరి చెంగయ్య, నిత్యకృష్ణారెడ్డి, బాబు, రామారావు, అంజయ్య, చిరంజీవి ఆచారి, ధనుంజయ, బాలుశెట్టి తదితరులు పాల్గొన్నారు.





పోలేరమ్మను దర్శించుకుంటున్న జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి - మాజీ మంత్రి పరసారత్నంను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఏపీఐఐసీ భూములను వినియోగంలోకి తీసుకురండి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే విజయశ్రీ వినతి

పెళ్లకూరు, మే 7(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోకవర్గ పరిధి లోని పెళ్ళకూరు మండలంలో 15 ఏళ్ల క్రింతం ఏపీఐఐసీ సేకరించిన భూములు నిరుపయోగంగా ఉన్నాయని, ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు బాధిత రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, టీడీపీ ఇన్‌చార్జి, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం సత్యవేడు వెళుతున్న మంత్రికి పెళ్లకూరులో ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల, టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. ఏపీఐఐసీకి కేటాయిం చిన భూములపై ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు. 15ఏళ్ల క్రితం మండలంలోని శిరసనంబేడు, చెన్నప్ప నాయుడుపేట ప్రాంతాల్లో సెజ్ ఏర్పాటు చేసేందుకు సుమారు 250 ఎకరాలు ప్రభుత్వం సేకరించింద న్నారు. అయితే రైతులకు పరిహారం చెల్లించలేదని, అప్పటి నుంచి భూములు సైతం నిరూపయోగంగా ఉన్నాయని మంత్రి దృష్టికి తీసు కెళ్లారు. ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిచాలని కోరారు. అలాగే భూములు ఇచ్చిన రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పెళ్లకూరు, ఓజిలి మండలా టీడీపీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, విజయ్‌కుమార్ నాయుడు, నాయ కులు గున్నం మధుసూదన్‌రెడ్డి, పేరంశెట్టి శ్రీరాంప్రసాద్, కట్టా వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

కోట ఎంపీడీవోగా దిలీప్‌కుమార్ నాయక్



కోట, మే 7 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఆర్.దిలీప్‌కుమార్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న దిలీప్‌కుమార్ నాయక్ పదోన్నతిపై కోట ఎంపీడీవోగా వచ్చారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని కాశీ లేవుట్‌లోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి చందన, విభూతి, పంచామృ తంతో అభిషేకాలు జరిపి ప్రత్యేకలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి పూజలు, భజన కార్యక్రమాలు జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

కన్యకా పరమేశ్వరికి పూజలు



అమ్మవారి కలశం, ప్రతిమలను ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు

కోట, మే 7 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని తూర్పు వీధిలో వెలసిన వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవీ జయంతి వేడు కలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు. అమ్మవారికి సామూహిక మల్లెపూల అర్చన జరిగింది. అనంతరం పల్లకిసేవ నిర్వహించారు. అమ్మవారి కలశాలు, ప్రతిమలతో మేళతాళాల మధ్య పట్టణంలోని గాంధీరోడ్డు సెంటర్ నుంచి గోపాల్‌రెడ్డి విగ్రహం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

గూడూరులో...

గూడూరు అర్బన్, మే 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ జయంతి సందర్భంగా బుధవారం అమ్మవారికి పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం నుంచి మహిళలు 102 కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో హోమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డీఎల్‌డీవో కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురండి



డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

గూడూరు, మే 7(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎల్‌డీవో కార్యాలయాన్ని త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని నెల్లూరు జడ్పీ సీఈవో విద్యారమ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలోని డీఎల్‌డీవో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎల్‌పీవో సుష్మితారెడ్డి, ఎంపీడీవో మధుసూదనరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతమ్మ కొలుపు ప్రారంభం



పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిల్లకూరు, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు అరుంధతీయపాళెంలో ఐదురోజుల పాటు నిర్వహించనున్న మాతమ్మ కొలుపు బుధవారం ప్రారంభమైంది. ముందుగా అమ్మవారికి అభిషే కాలు, ప్రత్యేక పూజలు చేశారు. సద్ది పోయడం, ముడుపులు కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి మైలు ముగ్గు వేశారు. రాత్రి ఆసాదులు అమ్మవారి కథను భక్తులకు వివరించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ

కోట, మే 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిన్నెలపూడిలో గల వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయానికి దాతలు అందజేసిన సీసీ కెమెరాల డీసీ బాక్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. హుండీని పగులగొట్టే ప్రయత్నం చేయగా, అక్కడ ఉన్న ఇద్దరు వృద్ధులు కేకలు వేయడంతో పరారయ్యారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటయ్య ఎస్ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

వెంకటగిరి, మే7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం మున్సిపల్ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ గతంలో కార్మికులు సమ్మె చేసినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రమణ, పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు దెబ్బతిన్న దుకాణాల పరిశీలన

వెంకటగిరి, మే 7(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో మంగళ వారం గాలివాన బీభత్సం కారణంగా దెబ్బతిన్న దుకాణాలను ఎమ్మెల్యే రామకృష్ణ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ సుబ్బరావు, టీడీపీ నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, మంకు ఆనంద్, జీకేపల్లి బాబు, మల్లారం బాబు, మురళి తదితరులు ఉన్నారు.

వైసీపీ కార్యకర్తలతో నేదురుమల్లి సమావేశం

వాకాడు, మే 7 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని వైసీపీ కార్యకర్తల తో ఆ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బుధవారం సమా వేశం నిర్వహించారు. కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సనిల్‌రెడ్డి, వాకాటి రవి తదితరులు పాల్గొన్నారు.

గదుల వివరాలు బోర్డులో ఉండాలి

శ్రీకాళహస్తి, మే 7(ఆంధ్రజ్యోతి): లాడ్జీల్లో రిసెప్షన్ వద్ద గదుల వివరాలు, వాటి ధరల వివరాలను తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలని డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. బుధవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద లాడ్జీల ఓనర్లు, మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గది తీసుకునే వారి వివరాలను ఆధార్‌కార్డుతో సహా నమోదు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్ల ద్వారా యాత్రికుల నుంచి అధిక వసూళ్లకు పాల్పడకూడదన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నా కొడుకు ఆచూకీని తెలపండి

తల్లిదండ్రుల వేడుకోలు

ఏర్పేడు, మే 7(ఆంధ్రజ్యోతి): తమ కొడుకు పవన్‌కళ్యాణ్ రెండు రోజులుగా కనిపించడం లేదని ఆచూకీ తెలపాలని ఏర్పేడు మండలం ఇసుకతాగేలి పంచాయతీ బీసీ కాలనీకి చెందిన మునిరెడ్డి, రాణి దంపతులు బుధవారం ఏర్పేడు పోలీసులను వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబానికి అంజిమేడు గ్రామానికి చెందిన కోదండ రామిరెడ్డి కుటుంబానికి మధ్య కొద్ది రోజులుగా భూవివాదం నడుస్తోందని చెప్పారు. ఈనెల 4వ తేదీ రెండు కుటుంబాల మధ్య మరోసారి గొడవ జరిగిందన్నారు. ఆ రోజు నుంచి వెటర్నరీ కళాశాలలో రెండవ సంవత్సరం చదివే తన పెద్దకుమారుడు కనిపించడంలేదని విలపించారు.

నిధుల స్వాహాపై కొనసాగుతున్న విచారణ

పుత్తూరు అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో నిధుల స్వాహా అంశంపై కమిటీ సభ్యుల విచారణ కొనసాగుతోంది. బుధవారం పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు పలు రికార్డులు, రోడ్లు, కాలువల నిర్మాణం, పారిశుధ్య వాహనాల వివరాలు, ఎస్ఎస్ ట్యాంక్ పనులు, డంపింగ్ యార్డులలో పర్యవేక్షించారు. విచారణ మందకొడిగా సాగుతుండటంతో పురపాలక శాఖ నుంచి త్వరితగతిన నివేదిక సమర్పిం చాలని విచారణ కమిటీకి ఉత్తర్వులు అందాయి. ఈ క్రమంలో విచారణ కమిటీ బృందం వేగం పెంచినట్లుగా కనిపిస్తోంది. మరో వారం రోజుల్లో విచారణ బృందం ఆర్డీకి నివేదిక అందజేయనున్నట్లు సమాచారం.







సత్యవేడు నియోజకవర్గ పర్యటన కోసం బుధవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, కురుగొండ్ల రామకృష్ణ

కోనేటిరాయుడి కల్యాణ వేడుక




పద్మావతి పరిణయోత్సవాల్లో రెండో రోజైన బుధవారం నారాయణగిరి ఉద్యానవనంలోని వేదికపై శ్రీదేవి భూ సమేత శ్రీనివాసుడిని కొలువుదీర్చి కల్యాణ సంబరాన్ని నిర్వహించారు. సాయంత్రం మలయప్పస్వామి అశ్వవాహనాన్ని అధిరోహించి సకల సార్వభౌమాధికార లాంఛనాలతో బయలుదేరి పరిణయోత్సవ మండపానికి వచ్చారు. వెంట స్వర్ణపల్లకిలో శ్రీదేవి, భూదేవి అనుసరించారు. తొలిరోజు తరహాలోనే ఉత్సవర్లకు ఎదుర్కోలు, పూలమాలలు మార్చడం, పూలబంతులాట, నూతన వస్త్రధారణ తదితర కార్యక్రమాలు పూర్తయ్యాక కొలువు నిర్వహించారు. శ్రీవారు దేవేరులతో కలిసి తిరుచ్చిలో ఊరేగుతూ రాత్రి 8.30 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో పోలీసుల మాక్ డ్రిల్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర' నేపథ్యంలో బుధవారం తిరుపతిలో పోలీసులు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యాన అన్నమయ్య సర్కిల్ రోడ్డులో రిజర్వు పోలీసు బలగాలు ఈ కార్యక్రమం చేపట్టాయి. ఉగ్రవాదులు అనుకోని సంఘటనలకు పాల్పడినా వారి నుంచి ఎలా తప్పించుకోవాలి? ఎలా ఎదుర్కోవాలి? అనే అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఉగ్రవాదులు దాడులకు వచ్చిన సమయంలో సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం.. లైట్లు ఆపేయడం చేయాలని డీఎస్పీ సూచించారు.


తిరుపతిలో మాక్ డ్రిల్ చేస్తున్న పోలీసులు

బస్సెక్కుతున్న మహిళను నెట్టి..

బంగారు గాజులు కొట్టేశారు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బస్సెక్కుతున్న 70 ఏళ్ల వృద్ధురాలిని నెట్టి చేతి గాజులు కొట్టేశారు. బుధవారం రాంభగీచ అతిథి గృహం బస్టాండు వద్ద రద్దీలో ఈ చోరీ జరిగింది. బాపట్ల జిల్లాలోని తుమ్మినేని గ్రామానికి చెందిన రవికుమార్ తల్లి లక్ష్మిని ముగ్గురు వెనుక నుంచి నెట్టడంతో ఆమె మెట్లమీద పడిపోయింది. వెంటనే ఆమె చేతికి ఉన్న బంగారు గాజులు లాక్కుని పరుగుతీశారు. 50 గ్రాముల గాజులు చోరీ అయినట్టు రవికుమార్ తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజ్ ద్వారా దుండగలను గుర్తించిన పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు.

కారు ఢీకొని ఏఆర్ కానిస్టేబుల్ మృతి


ఢిల్లీ బాబు(ఫైల్ ఫొటో)

వడమాలపేట, మే 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం కదిరిమంగళం బైపాస్ రోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ ఢిల్లీబాబు (46) మృతిచెందారు. నాగలాపురం మండలం వినోబానగర్‌కు చెందిన ఈయన మంగళవారం రాత్రి తిరుపతిలో విధులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వడమాలపేట మీదుగా వెళ్లడానికి కదిరిమంగళం వద్ద రోడ్డు దాటుతుండగా వెంకటగిరికి చెందిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను తిరుపతి రుయాస్పత్రికి తరలించగా.. శ్వాస సమస్య ఏర్పడడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేశారు.

ఎస్వీఎంసీ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

● రుయా సూపరింటెండెంట్ కూడా



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రవిప్రభు, డాక్టర్ రాధ

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్‌గా డాక్టర్ రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరిని ఎస్వీఎంసీ.. రుయాస్పత్రి సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తానని రవిప్రభు చెప్పగా.. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూస్తానని రాధ పేర్కొన్నారు.

ఏటీఎం చోరులకు రిమాండ్

తిరుపతి(నేరవిభాగం), మే 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజుల క్రితం తిరుపతి బాలాజీ కాలనీలోని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ దొరికిన ముగ్గురిలో ఒకరిని సబ్‌జైలుకు.. మరో ఇద్దరిని జువైనల్ హోంకు తరలించారు. వెస్ట్ ఎస్ఐ అనిల్‌కుమార్ వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా గురుఆయర్, చెన్నై అన్నానగర్‌కు చెందిన ఇద్దరు బాలురతో కలిసి అన్నానగర్‌కు చెందిన ముత్తు పాండ్యన్ ఈనెల 3వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇనుప రాడ్‌తో పీఎన్‌బీ ఏటీఎం పగులకొట్టడానికి ప్రయత్నించాడు. అక్కడి సీసీ కెమెరాల ద్వారా ముంబైలో ఉన్న బ్యాంకు కమాండ్ కంట్రోలు యూనిట్ సిబ్బంది గమనించి వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లోకేష్ బాబు సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని అరెస్టు చేశారు. వారి నుంచి ఇనుపరాడ్ స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఇద్దరు మైనర్లు కావడంతో జువైనల్ హోంకు.. ముత్తుపాండ్యన్‌ను రిమాండ్‌కు తరలించారు.

సదరన్ డిస్కం డైరెక్టర్ల బాధ్యతల స్వీకరణ


అయూబ్ ఖాన్, గురవయ్యను అభినందిస్తున్న సీఎండీ కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్) మే7(ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కం డైరెక్టర్లుగా పి.అయూబ్ ఖాన్, గురవయ్య బుధవారం తమ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. వీరిని సీఎండీ కె.సంతోషరావు అభినందించారు. అధికారులు, జీఎంలు,ఈఈలు శుభాకాంక్షలు తెలిపారు.

18నుంచి చిత్తూరు ప్రీమియర్ లీగ్

తిరుపతి(క్రీడలు), మే 7(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్, ఏపీఎల్ తరహాలో క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈనెల 18వ తేదీ నుంచి పది రోజుల పాటు చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్)మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు క్రికెట్ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 11న బిడ్డింగ్ ఏర్పాటు చేస్తామని, ఐపీఎల్ తరహాలో క్రీడాకారులను ఆయా స్పాన్సర్లు కొనుగోలు చేస్తారన్నారు. ఎస్వీయూ క్రీడా మైదానంలో ఈ నెల 18న పోటీలు మొదలవుతాయని, రోజుకు రెండు మ్యాచ్‌లు ఉంటాయని వివరించారు. 6 కెమెరాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. 17 నుంచి 35 ఏళ్ల వారికే అవకాశమన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు గిరిబాబు, శ్రీనివాసమూర్తి, సతీష్‌యాదవ్, శ్రీధర్‌కుమార్, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

తిరుపతి(ఆటోనగర్), మే7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో గురువారం నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరగనున్నాయి. ఈ పోస్టర్లను బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఆవిష్కరించారు. పాతికేళ్ల తర్వాత తిరుపతిలో రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా సమస్యలు, పరిష్కారంపై చర్చ జరుగుతుందన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. పోస్టర్ల ఆవిష్కరణలో కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.లక్ష్మి, మాధవ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

పిడుగుపాటుకు ఇద్దరు గిరిజనుల మృతి


మురళి - శంకర్

శ్రీకాళహస్తి, మే 7(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో ఇద్దరు గిరిజనులు మృతి చెందారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్టీకాలనీలో బుధవారం వెలుగు చూసింది. ఎస్టీకాలనీకి చెందిన బావ బామ్మర్ది అయిన మురళి(50), శంకర్(36) వ్యవసాయ కూలీలు. చేపల వేటపైనా జీవనం సాగిస్తుంటారు. మంగళవారం కూలి పనుల కోసం వెళ్లిన వీరు రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించారు. ఈ క్రమంలో ఎస్టీకాలనీ సమీపంలోని పంట పొలాల్లో మురళి, శంకర్ విగతజీవులుగా పడి ఉండగా గుర్తించారు. మంగళవారం సాయంత్రం పిడుగుపాటుతో వీరిద్దరు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు భావించి మృతదేహాలను ఇంటికి తరలించారు. బుధవారం సమాచారం తెలుసుకున్న వీఆర్వో శ్రావణ్ ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి, రూరల్ సీఐ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలకు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. మురళికి భార్య, ఇద్దరు కుమారులు.. శంకర్‌కు భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు బంధువులైన ఇద్దరు గిరిజనులు మృతి చెందడంతో ఎస్టీకాలనీలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఊరందూరు ఎస్టీకాలనీకి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.


మురళి, శంకర్ మృతదేహాలు

గాలివాన బీభత్సం

● రాలిన మామిడి, మిరప


బీఎన్‌కండ్రిగలో వర్షానికి తడిసిన మిరప కాయలను ఆరబెడుతున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 7 (ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగ మండలంలో మంగళవారం రాత్రి గాలి,వాన బీభత్సం సృష్టించింది. మామిడి, మిరప రైతులకు భారీ నష్టం జరిగింది. 200 ఎకరాలలో మామిడి.. 20 ఎకరాలలోని మిరపపంట దెబ్బతింది. తడిసిపోయిన మిరపకాయలను రైతులు బుధవారం ఆరబెట్టుకున్నారు. అనేక గ్రామాలలో చెట్లు నేల కూలాయి. బీఎన్ కండ్రిగలో గాలి వానకు వినాయకమ్మ బొమ్మల షెడ్డు కూలి పోయింది. ట్రాన్స్‌కోకు రూ.3లక్షలకు పైగా తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలగా.. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకు ఒరిగాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడగా, బుధవారం డిస్కం అధికారులు సరఫరా పునరుద్ధరణ చేపట్టారు.

తిరుమలలో పెట్రోలు బంకు లీజులోనూ అవినీతి

● వైసీపీ నేతల కోసం అప్పటి అధికారుల మాయ ● భానుప్రకాష్‌రెడ్డి ఆరోపణ

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలను అంగుళం అంగుళం అమ్మే ప్రయత్నం చేశారని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. తిరుమల ఆలయం ముందు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 2019 నుంచి 2024 వరకు తిరుమలలో జరిగిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయన్నారు. 2022 ఏప్రిల్‌లో చేసుకున్న ఒప్పందం ప్రకారం తిరుమలలో నడుస్తున్న ఐఓసీఎల్ పెట్రోల్ బంక్ నెలకు దాదాపు రూ.4 లక్షల వరకు టీటీడీకి అద్దె చెల్లిస్తుండగా, అదే ఏడాది మేలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌కు మాత్రం అదే తిరుమలలో నెలకు రూ.2.20 లక్షలకే కేటాయించారని తెలిపారు. ఐఓసీఎల్‌కి ఏడాదికి 3శాతం అద్దె పెంపు నిర్ణయం ఉండగా, హెచ్‌పీసీఎల్‌కు అద్దె పెంపు లేకుండానే 15 ఏళ్లకు లీజుకు ఇచ్చేశారని వివరించారు. అప్పటి వైసీపీ నాయకులను ప్రసన్నం చేసుకోవడానికే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ వ్యవహారంలో నెలకు దాదాపు రూ.25 లక్షలు చేతులు మారాయని ఆరోపించారు. స్వామి ఆదాయానికి గండి కొట్టిన ఈ అనుమతులను రద్దు చేయాలని బోర్డులో ప్రస్తవిస్తామన్నారు. అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలనేది తన డిమాండ్ అన్నారు.



జాతరలో అశేష జనవాహిని - నిమజ్జనానికి తరలివెళుతున్న పోలేరమ్మ

వైభవంగా పోలేరమ్మ జాతర

నాయుడుపేట/టౌన్, మే 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర బుధవారం వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తి పడమటి వీధిలోని కుమ్మరి ఇంటి నుంచి బాజాభజంత్రీలు, మంగళవాయిద్యాలు, భక్తుల నృత్యాల నడుమ బయలుదేరి శెట్టిపల్లివారి వీధిలోని అలంకరణ గుడికి బుధవారం వేకువజామున చేరుకుంది. అక్కడ నిశ్చయతాంబూలం అనంతరం బేరిపేట నుంచి వచ్చిన సప్పరంపై పోలేరమ్మ కొలువుతీరాక గ్రామోత్సవం నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద చలువ పందిరిలో పోలేరమ్మను కొలువుతీర్చారు. అమ్మవారి ఎదుట భక్తులు కుంభాలు పోసి పూజలు చేశారు. విన్నమాల గ్రామస్థులు పొలికూడు చల్లారు. అనంతరం అమ్మవారి మెట్టినిల్లైన పాత పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడినుంచి సప్పరంపై అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగింపుగా రాజగోపాలపురానికి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): నగరంలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందికి తిరుపతి నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పారు. వారం రోజులుగా ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 12మందిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు.

వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘు కొత్త కార్యవర్గం

తిరుపతి రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాల అధ్యాపకుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ బి.రాంబాబునాయక్, డాక్టర్ కె.లక్ష్మీకవిత, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎన్.వినోద్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ ఏవీఎన్ శివకుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ జడ్.నవీన్, సెంట్రల్ అసోసియేట్ నామినీగా డాక్టర్ వి.అశోక్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కె.సుధాకర్‌గౌడ్, డాక్టర్ కె.కుమార్, డాక్టర్ డబ్ల్యూ. దీప్తిస్వప్నలత ఎన్నికయ్యారు. వీరు రెండేళ్లపాటు కొనసాగుతారు.

ఆర్‌డీఎస్ఎస్ పనులను సకాలంలో పూర్తి చేయండి

తిరుపతి(ఆటోనగర్), మే7(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని ఐదు ఉమ్మడి జిల్లాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ నిర్మాణ పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజరు అశోక్ రాథోడ్ ఆదేశించారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం దళవాయిపల్లి గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సదరన్ డిస్కం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఐదు జిల్లాల్లో జరుగుతున్న పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించారు. ఈ సమావేశంలో సీఎండీ కె.సంతోషరావు, డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్, సీజీఎం రమణాదేవి, జీఎం శ్రీనివాస్, ఈఈ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న అశోక్ రాథోడ్

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు పూర్తి చేయండి

తిరుపతి(కలెక్టరేట్),మే7(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని కలెక్టర్, స్మార్ట్‌సిటీ చైర్మన్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేశామని, అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని గడువు లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, స్మార్ట్‌సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'మన పల్లె జానపదం జాతర'

తిరుపతి అర్బన్, మే 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్ర, శనివారాల్లో 'మన పల్లె జానపదం జాతర' నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఎస్వీయూ సెనేట్ హాల్లో ఏర్పాట్లు చేశారు. ప్రజా కళావేదిక, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటికే 300 మంది ప్రతినిధులు పేర్లు నమోదు చేసుకున్నారని, ప్రారంభ, ముగింపు సభలకు ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పాల్గొననున్నారని ప్రజా కళావేదిక చైర్మన్ అరవ జయపాల్, ఎస్వీయూ సాంస్కృతిక సమన్వయకర్త డాక్టర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

శ్రీసిటీలో నేడు మంత్రి లోకేశ్‌చే ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన

తిరుపతి, మే 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ గురువారం శ్రీసిటీలో ఎల్జీ పరిశ్రమకు శంకుస్థాపన చేయనున్నారు. సత్యవేడులో బుధవారం సాయంత్రం కార్యకర్తలతో సమావేశమైన ఆయన అక్కడే రాత్రి బస చేశారు. గురువారం ఉదయం శ్రీసిటీ చేరుకుని ఎల్జీ పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. రూ.5001 కోట్ల పెట్టుబడితో మూడు దశల్లో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తయారు చేసే ప్లాంట్ నెలకొల్పి 1495 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, మరో రూ.839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లు నెలకొల్పుతామని ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. ఎల్జీ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్ వారితో చర్చించారు. శ్రీసిటీలో ఆ సంస్థకు 450 ఎకరాల కేటాయింపు, పలు రాయితీలు, మినహాయింపులను ప్రకటిస్తూ గతేడాది నవంబరులో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది జనవరిలో మొదలు కావాల్సిన ప్లాంట్ పనులు.. వివిధ కారణాలతో ఆలస్యమైంది. వాస్తవానికి ఎల్జీ పరిశ్రమకు గురువారం సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయాల్సి ఉండగా, బిజీ షెడ్యూలు కారణంగా ఆయన పర్యటన మారింది. దీంతో ఐటీ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు.

అనుమతుల్లేని దుకాణం తొలగింపు

తిరుమల, మే7(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని కర్ణాటక సత్రాల్లో ఓ దుకాణాన్ని టీటీడీ రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. అనుమతులు లేకుండా దీనినిఏర్పాటు చేశారంటూ సోషల్ మీడియాలో రావడంతో ఉన్నతాధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈక్రమంలో టీటీడీ ఎస్టేట్ విభాగం ఏఈవో, సర్వేయర్, ఆర్ఐ బృందం బుధవారం ఆ దుకాణాన్ని తొలగించారు. దుకాణ సామగ్రిని ట్రాక్టర్‌లో తరలించారు. అనుమతులు ఉంటేనే దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, కర్ణాటక సత్రాల అనుమతి ఉంటే సరిపోదని హెచ్చరించారు.

'అల్లూరి'కి ఘన నివాళి


అల్లూరి సీతారామరాజుకు పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా నాటి బ్రిటీష్ పాలకులను ఎదురించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సెట్విన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురస్కరించుకుని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జేసీ శుభం బన్సల్, సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ఆరుగురు జీబీ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తులు

తిరుపతి(వైద్యం), మే 7(ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన జీబీ సిండ్రోమ్ (గులైన్-బరీ సిండ్రోమ్) వ్యాధితో స్విమ్స్ న్యూరాలజీ విభాగంలో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. వీరికి ప్రత్యేక వార్డులో వైద్యం అందిస్తున్నామని, ఎలాంటి ప్రాణాపాయమూ లేదని, ఏబీ పాజిటివ్ రక్తం ఎక్కించాల్సి ఉందని వైద్యులు తెలిపారు. ఈ గ్రూపు రక్తం స్విమ్స్ బ్లడ్ బ్యాంకులో అందుబాటులో లేదని, దాతలు ముందుకు రావాలని కోరారు. కండరాల బలహీనత, తిమ్మిర్లు, శ్వాసకోశ సమస్యలు, కంటి కదలికల్లో ఇబ్బందులుంటే అవి జీబీ వైరస్ లక్షణాలు కావచ్చని, అలాంటి వారు వైద్యులను సంప్రదించాలన్నారు.

దొంగను పట్టిచ్చిన ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరా

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లోకి చొరబడుతున్న దొంగను లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టమ్ కెమెరా పట్టిచ్చింది. గొల్లవానిగుంటలో కాపురమున్న ఒక కుటుంబం సెలవులు కావడంతో బయటకు వెళ్లారు. నాలుగు రోజులుగా రెక్కీ నిర్వహించిన దొంగ ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి తాళాలు పగులకొట్టి చోరీకి యత్నించాడు. అక్కడ పోలీసులు ఏర్పాటు చేసిన లాక్డ్‌హౌస్ మానటరింగ్ కెమెరా ద్వారా ఈ విషయాన్ని గుర్తించిన కమాండ్ కంట్రోలు సిబ్బంది వెంటనే అలిపిరి పోలీసులను అప్రమత్తం చేశారు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి చోరీకి పాల్పడుతున్న దొంగను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్‌బాబు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి


మృతి చెందిన తిరుపతి

తిరుపతి(నేరవిభాగం), మే 7(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడు మృతి చెందిన ఘటన బుధవారం స్థానిక కొరమేనుగుంటలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... నెల్లూరు గాంధీజీ కాలనీకి చెందిన 20 మంది జాతరలో భిక్షాటన చేసేందుకు రెండు రోజుల క్రితం తిరుపతికి వచ్చారు. కొరమేనుగుంట పోస్టల్ కాలనీలో ఉంటున్నారు. వీరిలో తిరుపతి(20) జాతర వేషం కోసం ఇంటి వద్ద వేప చెట్టు ఎక్కి ఆకు కోస్తుండగా పైనున్న తీగలు తగిలి షాక్‌కు గురై కిందపడ్డాడు. తోటి స్నేహితులు అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని రుయాకు తరలించి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ తీగలతో వేటకు పాల్పడితే కఠిన చర్యలు

ఎర్రావారిపాలెం, మే 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగెలతో అటవీ జంతువులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ చిన్న రెడ్డెప్ప అన్నారు. నెరబైలు సబ్ స్టేషన్‌లో బుధవారం రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పరిధి కావడంతో నిరంతర కాపలా కష్టమైన పని అన్నారు. ఈఅటవీ ప్రాంతంలో కొంతమంది కరెంట్ తీగలతో వన్య ప్రాణుల వేటకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారముందన్నారు. పొలాల వద్ద అనుమానాస్పదంగా వేటకు తిరుగాడే వ్యక్తుల వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో చిన్నగొట్టిగల్లు ఈఈ రమేష్ బాబు ,ఎర్రావారిపాలెం ఎఈ జ్యోతిప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు డీపీటీవో బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆర్టీసీ), మే 7(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజారవాణాధికారిగా వెంకటరావు గురువారం ఉదయం 11గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం అధికారులతో సమావేశమై ప్రజా రవాణా వ్యవహారాలపై చర్చించనున్నారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు 301 మంది గైర్హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 7(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్ రాత పరీక్షలకు 610 మంది అభ్యర్థులు హాజరయ్యారని కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 610మంది హాజరయ్యారని, 301మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు.